www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 208 | ఆదివారం 27.09.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

## మన్మోహన్ సేవలు భావితరాలకు స్ఫూర్తి

**దేశ ఆర్థిక ప్రగతికి ఆయన సేవలు మరువలేనివి**

హైదరాబాద్ నడిబొడ్డున మాజీ ప్రధానికి ఘన నివాళి

**దేశం గర్వించే నేత.. ఆర్థిక సంస్కరణల శిల్పి మన్మోహన్ సింగ్**



- విప్రో సర్కిల్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ
- మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి
- దేశ ఆర్థిక ప్రగతికి ఆయన సేవలు మరువలేనివి
- తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర
- పీవీ-మన్మోహన్ సంస్కరణలతో దేశానికి కొత్త దిశ
- మన్మోహన్ సింగ్ నిజమైన జాతిరత్నం
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మాజీ ప్రధాని విగ్రహం
- కేంద్రం వెంటనే భారతరత్న ప్రకటించాలి
- మన్మోహన్ సేవలు భావితరాలకు స్ఫూర్తి

02

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ ఐటీ, ఫైనాన్షియల్ హబ్‌గా వెలుగొందుతున్న గచ్చిబౌలిలోని విప్రో సర్కిల్‌లో భారత మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం ఘనంగా ఆవిష్కరించారు. రాష్ట్ర ఆర్థిక రంగానికి గుండెకాయ లాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని నెలకొల్పుకోవడం తెలంగాణ గర్వకారణమని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. పరిపాలనలో ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు, చూపిన దార్శనికత దేశ సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేశాయని కొనియాడారు. ఈ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం గర్వించదగిన అసలైన జాతిరత్నం డాక్టర్ మన్మోహన్ సింగ్ అని అభివర్ణించారు.







# సీతక్క కీలక ప్రకటన

## ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం..

5,118 పంచాయతీ భవనాలకు రూ.1,000 కోట్లు

ప్రతి మండలానికి ముగ్గురు సభ్యులతో కమిటీ

**8 వేల గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు**

- ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం.. సీతక్క
- ఈ ఏడాదిలోనే పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తి
- గ్రామీణ రహదారులకు రూ.3,382 కోట్లు
- 3,861 కి.మీ. మేర రహదారుల నిర్మాణం
- తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు
- ప్రతి మండలానికి ముగ్గురితో తాగునీటి కమిటీ
- అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు.. సీతక్క
- బాగా పనిచేస్తే సన్మానం.. అలసత్వమైతే చర్యలు
- గ్రామీణ రోడ్ల నిర్మాణంలో కొత్త విధానం

02

గిరిజన, చెంచు పెంటలపై ప్రత్యేక శ్రద్ధ

# పూరిగుడిసెలు లేని రాష్ట్రంగా...

## ఆగిన అభివృద్ధి పనులకు మళ్లీ వేగం



**జనగామలో 500 పూరిగుడిసెల కుటుంబాలకు ఇళ్లు**

గత పాలనలో పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు మోక్షం

**అసంపూర్తి ఇళ్ల పూర్తికి రూ.2-3 లక్షల సాయం**

- పేదల సొంతింటి కల సాకారం చేస్తాం.. మంత్రి పొంగులేటి
- రాష్ట్రంలో పూరిగుడిసెలు లేకుండా చేయడమే లక్ష్యం
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు
- తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- దసరా నాటికి 2.18 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి

03

# కేవలం ప్రజారోగ్య సమస్య కాదు..

**బాలల రక్షణ అంశం కూడా: సీజేఐ సూర్యకాంత్**



- డ్రగ్స్ వాడకాన్ని బాలల రక్షణ అంశంగా చూడాలి
- వ్యసనానికి గురైన పిల్లల పట్ల సున్నితంగా వ్యవహరించాలి
- మత్తు నుంచి బయటపడటంతో పాటు సహజ బాల్యాన్ని తిరిగి అందించాలి
- బాలల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసాన్ని కాపాడటం కీలకం: సీజేఐ

02



**గణేశ్ నిమజ్జనాల్లో తీవ్ర విషాదాలు..**

రాష్ట్రవ్యాప్తంగా 3.5 నుంచి 4 లక్షల వినాయక విగ్రహాలు

నిమజ్జన వేడుకల్లో విషాదం.. 13 మంది మృతి

పండుగ వేళ అపశ్రుతులు.. 26 మందికి తీవ్ర గాయాలు

భారీ బందోబస్తు మధ్యనూ తప్పని విషాదం...డీజీపీ సీవీ ఆనంద్

# నిమజ్జనం ప్రశాంతం..

## వచ్చే ఏడాది నుంచి కలర్ పేపర్లపై నిషేధం

ఖైరతాబాద్‌కు 30 లక్షలు.. బాలాపూర్‌కు 15 లక్షల మంది

- నిమజ్జనం విజయవంతం.. పోలీసులకు సీపీ అభినందనలు
- ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం పూర్తి.. ట్రాఫిక్ ఆంక్షలు ఎత్తివేత
- సమిష్టి కృషితో నిమజ్జనం ప్రశాంతం.. సజ్జనార్
- గణేష్ నిమజ్జనానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- నిమజ్జనంలో కొన్ని ఘటనలు.. లోపాలపై సమీక్షిస్తాం
- ఓవర్‌స్పీడ్, మద్యం సేవించి వచ్చిన వారిపై చర్యలు

02

హైదరాబాద్‌లో రెండు రోజులుగా జరిగిన గణేష్ మహా నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని సీపీ సజ్జనార్ తెలిపారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో నిమజ్జనం పూర్తవడంతో ట్రాఫిక్ ఆంక్షలు ఎత్తివేసి, క్రేన్లు, ఇతర ఏర్పాట్లను తొలగించారు. నిమజ్జనాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందికి సీపీ కృతజ్ఞతలు తెలిపారు.



## తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుంది

**ఉప ఎన్నికలో అభ్యర్థిని నిలబెడతాం..**

- పార్టీ మారి పోటీ చేయడం సరికాదురిమ్స్
- ఘటన బాధాకరం.. కవితచిన్నారుల
- మరణాలపై ప్రభుత్వం స్పందించాలిపిల్లలు
- చనిపోతుంటే సింగపూర్ ఎలా చేస్తారు?
- ప్రభుత్వ ఆస్పత్రులను పట్టించుకోవాలి
- ఓట్ల తొలగింపుపై అనుమానాలు ఉన్నాయి
- ఆరోగ్య రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి

03

# రేవంత్ రెడ్డి నిజాయితీ గల మోసగాడు..

## 2028లో బీఆర్ఎస్‌దే అధికారం..

- రేవంత్ పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ప్రజలు పాత రోజులను గుర్తు చేసుకుంటున్నారు
- రైతుబంధు విషయంలో ప్రభుత్వం విఫలమైంది
- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- రాష్ట్ర ప్రజల పరిస్థితి దారుణంగా మారింది

03



## ఈసీ బీజేపీ కార్యాలయం కాదు..

- గోవా ఓటర్ల అంశంపై సమాధానం చెప్పాలి
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి.. ఉత్తమ్
- ఎన్నికల సంఘం స్వతంత్రతే ప్రజాస్వామ్యానికి పునాది
- ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలను సహించం

03



## సోషల్ మీడియాలో డబ్బూ, నగలు ప్రదర్శన..

- సోషల్ మీడియా వీడియోల ఆధారంగా రెక్కీ?
- 118 సవర్ల బంగారం.. భారీగా నగదు అపహరణ
- ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లగానే చోరీ

05



# కేవలం ప్రజారోగ్య సమస్య కాదు..

## బాలల రక్షణ అంశం కూడా: సీజేఐ సూర్యకాంత్

**ఢిల్లీ :** దేశంలోని పిల్లల్లో మాదకద్రవ్యాల వినియోగం, వ్యసనాన్ని కేవలం సాధారణ ప్రజారోగ్య సమస్యగా మాత్రమే చూడకూడదని, దానిని అత్యంత ప్రధానమైన బాలల రక్షణ అంశంగా (చైల్డ్ ప్రొటెక్షన్ ఇష్యూ) గుర్తించాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఢిల్లీలోని బీహార్ లోక్ భవన్‌లో నిర్వహించిన పాటలీపుత్ర ప్రజ్ఞా ప్రవాహ్ కార్యక్రమంలో 'డ్రగ్స్‌కు ఆవల బాల్యం: రక్షణ, సంరక్షణ, పునరేకీకరణ' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. భారతదేశంలో ప్రతి ఐదుగురు యుక్త వయస్కుల్లో కనీసం ఒకరు చిన్నప్పటి నుంచే మాదకద్రవ్యాల వ్యసన ప్రమాదంలో ఉన్నట్లు ప్రముఖ అంతర్జాతీయ వైద్య పత్రిక 'లాన్సెట్' ఇటీవలి అధ్యయనం వెల్లడించిన చేదు నిజాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. దేశ భవిష్యత్తుకు పునాది అయిన బాల్యం మత్తు కోరల్లో చిక్కుకుపోవడం అత్యంత ఆందోళనకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యసనం బారిన పడిన పిల్లల విషయంలో సమాజం, అధికార వ్యవస్థలు అత్యంత సున్నితత్వం తో కూడిన వైఖరిని (చైల్డ్-సెన్సిటివ్ రెస్పాన్స్) ప్రదర్శించాల్సిన అవసరం ఉందని జస్టిస్ సూర్యకాంత్ నొక్కి చెప్పారు. ఈ విధానం కేవలం వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడటానికి కాకుండా.. వారి ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నిలబెట్టేలా ఉండాలని సూచించారు. అసలైన పునరావాసం అంటే కేవలం మత్తు నుంచి దూరం చేయడం మాత్రమే కాదని.. ఒక బిడ్డకు సహజమైన బాల్యం అందించే విద్య, మానవ సంబంధాలు, ఆట పాటలు, నమ్మకం, ఉజ్వల భవిష్యత్తుపై భరోసాలను తిరిగి అందించగల అనుకూల పరిస్థితులను కల్పించడమేనని తేల్చిచెప్పారు. కష్టాల వలయం నుంచి బయటపడి పిల్లలు గౌరవప్రదమైన జీవితాన్ని పొందేలా చట్టబద్ధమైన రక్షణ వ్యవస్థలు నిరంతరం అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# 13 కొత్త బస్టాండ్లకి గ్రీన్ సిగ్నల్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునీకరించేందుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో ఆధునిక వసతులతో కూడిన నూతన బస్టాండ్లను నిర్మించనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, వాణిజ్య కార్యకలాపాలకు పెద్దపీట వేయడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం. నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్‌నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెం ప్రాంతాల్లో ఈ బస్టాండ్లు రానున్నాయి. ప్రయాణ సమయాల్లో వేచి ఉండే ప్రయాణికుల కోసం వెయిటింగ్ హాళ్లు, ఆహారం, షాపింగ్ అన్నీ ఒకే చోట లభించేలా ఫుడ్ కోర్టులు, బిజినెస్ కాంప్లెక్స్‌లు, వినోద కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా కొడంగల్, మద్దూరు, కోస్గి, హుస్నాబాద్ ప్రాంతాలలో ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొడంగల్‌లో 1.91 ఎకరాల స్థలంలో రూ. 15.82 కోట్లతో (మొదటి ఆప్షన్) లేదా రూ. 11.53 కోట్లతో (రెండో ఆప్షన్) నిర్మాణాలు చేపట్టనున్నారు. కోస్గిలో 1.55 ఎకరాల్లో రూ. 15.08 కోట్లు లేదా రూ. 9.60 కోట్లతో, మద్దూరులో 1.05 ఎకరాల్లో రూ. 7.60 కోట్లు లేదా రూ. 4.48 కోట్ల అంచనా వ్యయాలతో ప్రణాళికలు సిద్ధం చేశారు. షాపులు, వ్యాపార సముదాయాల కేటాయింపులపై ఆసక్తి ఉన్న వ్యాపారులు ఆర్టీసీ యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ ఆధునిక బస్టాండ్లు ప్రయాణ కేంద్రాలుగానే కాకుండా గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడనున్నాయి. బస్టాండ్లలో ఏర్పాటు చేసే దుకాణాలు, ఫుడ్ కోర్టుల ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు, చిన్న వ్యాపారులకు, స్థానిక ఉత్పత్తులు విక్రయించే వారికి నూతన మార్కెట్ లభిస్తుంది. మొత్తంగా ఈ బస్టాండ్లు రవాణా, వాణిజ్యం, స్థానిక ఉపాధిని సమర్థవంతంగా అనుసంధానించే కేంద్రాలుగా అభివృద్ధి చెందనున్నాయి.

# గణేశ్ నిమజ్జనాల్లో తీవ్ర విషాదాలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ఎంతో ఘనంగా జరిగిన గణేష్ నిమజ్జనోత్సవాల్లో కొన్ని విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. పండుగ సందర్భంగా జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మొత్తం 13 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. అత్యంత విచారకరమైన విషయమేమిటంటే.. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో విధి నిర్వహణలో ఉన్న ఓ పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్ కూడా ఉన్నారు. ఈ చేదు వార్తను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్వయంగా వెల్లడించారు. నిమజ్జనం సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు సంఘటనల వల్ల ఈ ప్రాణనష్టం, గాయాలు సంభవించాయని తెలిపారు. బందోబస్తులో ఉన్న ఓ ఎస్సై రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. పఠాన్‌చెరువులో ఆరుగురు యువకులు, ఖైరతాబాద్, నిర్మల్‌లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. అలాగే డీజే సౌండ్స్‌తో గుండెపోటు గురై మరో వ్యక్తి మృతి చెందారు. ఇలా పలు ఘటనల్లో 13 మంది మృతి చెందడం బాధాకరమని డీజీపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, ఈ ఏడాది నిమజ్జనం నిర్వహణపై డీజీపీ మాట్లాడుతూ.. కొన్ని ఆసక్తికరమైన గణాంకాలను పంచుకున్నారు. ఈ వినాయక చవితి పండుగ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 1.24 లక్షల వినాయక విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించారు. ఇవే కాకుండా ప్రజలు తమ ఇళ్లలో, గేటెడ్ కమ్యూనిటీలలో, అపార్ట్‌మెంట్లలో స్వయంగా పెట్టుకున్న విగ్రహాలను కూడా కలుపుకుంటే, రాష్ట్రవ్యాప్తంగా వినాయక విగ్రహాల సంఖ్య ఏకంగా 3.5 లక్షల నుంచి 4 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్రంలోని వివిధ చెరువులు, జలాశయాల వద్ద ఎంతో కోలాహలంగా నిమజ్జన వేడుకలు సాగాయి. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులను నియంత్రించడానికి, ఎటువంటి గొడవలు జరగకుండా చూడటానికి పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ తో పాటు భద్రతను కూడా పర్యవేక్షించారని వివరించారు. అంత విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ, ఈ దురదృష్టకర ప్రమాదాల్లో 13 మంది చనిపోవడం, 26 మంది గాయపడటం తీవ్ర విచారాన్ని నింపింది.

# నిమజ్జనం ప్రశాంతం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రెండు రోజుల మహా నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని అన్నారు హైదరాబాద్ సీపీ సజ్జనార్. 2026 సెప్టెంబర్ 26న ట్యాంక్ బండ్ దగ్గర నిమజ్జనాల కార్యక్రమం పరిశీలించిన సీపీ.. మధ్యాహ్నం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జనాలు ప్రశాంతం ముగిశాయని ఈ సందర్భంగా చెప్పారు. ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో నిమజ్జనం పూర్తి కావడంతో ట్రాఫిక్ ఆంక్షలు ఎత్తివేసినట్లు చెప్పారు. క్రేన్లు తదితర నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన వాహనాలు, సమాగ్రిని కూడా తొలగించినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిమజ్జనాలు ముగిశాయని అన్నారు. ప్రశాంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమిష్టి కృషితోనే ఇంత పెద్ద టాస్క్ విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. అక్కడక్కడ కొన్ని లోపాలు, ఘటనలు జరిగినట్లు సీపీ తెలిపారు. గత రెండు రోజులుగా పోలీసులు నిద్ర కూడా లేకుండా నిమజ్జనాలలో పాల్గొన్నారని తెలిపారు. పోలీసులు విధులకు వచ్చిన తర్వాత వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని భవిష్యత్తులో మరింత మెరుగైన పోలీసింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించనున్నట్లు తెలిపారు. బందోబస్తుకు సిటీ బయటనుంచి, జిల్లాల నుంచి పోలీసులు వచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎక్కువ శోభాయత్ర జరిగిందన్నారు. నిమజ్జనం సక్సెస్ చేసినందుకు హోంగార్డు నుంచి ఐపీఎస్ వరకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

**వచ్చే ఏడాది నుంచి కలర్ పేపర్లు బ్యాన్ :**

నిమజ్జనం సందర్భంగా సిటీ వ్యాప్తంగా కలర్ పేపర్లు వాడటం వలన చాలా ఇబ్బందిగా మారిందన్నారు. దీని వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయని.. కొన్ని వాహనాలు స్కిడ్ అయ్యి పడే పరిస్థితి వచ్చిందన్నారు. జీహెచ్‌ఎంసీతో మాట్లాడి బ్యాన్ చేసే ప్రయత్నం చేస్తామన్నారు. అదేవిధంగా అన్నదానంలో ఉపయోగించిన ప్లేట్లు, గ్లాసులు ఎక్కడపడితే అక్కడ పడేయటం బాధించిందని అన్నారు. ఇక వాహనాల ఓవర్ స్పీడ్ కారణంగా కొన్ని ఇబ్బందులు తలెత్తినట్లు చెప్పారు. కొందరు శోభాయాత్రకు కొందరు తాగి వచ్చారని.. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఖైరతాబాద్ కు 30 లక్షలు, బాలాపూర్ కు 15 లక్షల మంది భక్తులు:**

గణేష్ విగ్రహాల దర్శనానికి చాలామంది భక్తులు వచ్చినట్లు చెప్పారు సీపీ సజ్జనార్. ఈ సారి పబ్లిక్ ఎక్కువ అయినట్లు తెలిపారు. ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహాన్ని 30 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు చెప్పారు. అదే విధంగా బాలాపూర్ గణేష్ విగ్రహాన్ని దర్శించుకునేందుకు ఈ సారి15 లక్షల మంది వచ్చినట్లు సీపీ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శోభాయత్ర, నిమజ్జనం పూర్తి చేసినట్లు తెలిపారు. సమిష్టి కృషితోనే నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని అన్నారు.

# తాట తీస్తామంటూ సజ్జనార్‌కు హెచ్చరిక..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత మరియు బెదిరింపు వ్యాఖ్యలను తెలంగాణ స్టేట్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ (హైదరాబాద్ సిటీ యూనిట్) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు నల్ల శంకర్ రెడ్డి ప్రకటన విడుదల చేశారు. బాధ్యతాయుతమైన ఒక సీనియర్ ఐపీఎస్ అధికారిని ఉద్దేశించి "మీ అంతు చూస్తా", "రిటైర్ అయిన తర్వాత కూడా నిన్ను వదలను" వంటి బెదిరింపు వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రం తగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులకు ఎంత గౌరవం ఉందో, చట్టబద్ధంగా విధులు నిర్వహించే అధికారుల గౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు.

**పోలీసు మనో ధైర్యం దెబ్బతినే అవకాశం:**

సజ్జనార్ సారథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్తు విధులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ఇలాంటి అధికారులపై వ్యక్తిగత దూషణలు చేయడం వల్ల పోలీసు సిబ్బంది మనోధైర్యం, ఆత్మగౌరవం దెబ్బతినే అవకాశం ఉందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు ఇద్దరూ ప్రజాస్వామ్యంలో ప్రజలకు సేవ చేసే బాధ్యతాయుత పదవుల్లో ఉన్నారని, అభిప్రాయ భేదాలు ఉంటే చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యక్తం చేయాలని అసోసియేషన్ కోరింది. వ్యక్తిగత దూషణలు, బెదిరింపులకు తావు ఉండకూడదని సూచించింది. పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా చట్ట ప్రకారం విధులు నిర్వహించే వాతావరణాన్ని ప్రతీ ఒక్కరూ గౌరవించాలని విజ్ఞప్తి చేసింది.

**కౌశిక్ రెడ్డి ఏమన్నారు?:**

కాగా వినాయక నిమజ్జనాల సందర్భంగా రాజకీయ పాటలపై నిషేధిస్తున్నట్లు సజ్జనార్ వ్యాఖ్యానించగా ఈ మాటలపై స్పందించిన కౌశిక్ రెడ్డి కేసీఆర్ పాటలపై నిషేదాలు విధించేందుకు సజ్జనార్ ఎవరు అని ప్రశ్నించారు. సజ్జనార్ ఏమైనా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారా? బీఆర్ఎస్ అధఇకారంలోకి రావడం ఖాయం అని అప్పుడు సజ్జనార్ ఎక్కడున్నా వదిలిపెట్టేది లేదని ఆయన తాట తీస్తామని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి వార్నింగ్ పై తాజాగా తెలంగాణ స్టేట్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ యూనిట్ రియాక్ట్ అయింది.

# సీతక్క కీలక ప్రకటన




**రంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణలోని ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సొంత భవనాలు లేని 5,118 గ్రామ పంచాయతీల కోసం రూ. 1,000 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు సీతక్క వెల్లడించారు. ఇప్పటికే 3,269 భవనాల నిర్మాణ పనులు 70 శాతం మేర పూర్తయ్యాయని, మిగిలిన పనులను ఈ ఏడాదిలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. దీంతో పాటు 8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాల నిర్మాణం కోసం రూ. 800 కోట్లు కేటాయించామని, ఈ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన ప్రాంతీయ సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.

**హ్యామ్ విధానంలో గ్రామీణ రహదారులు:**

దేశంలోనే తొలిసారిగా గ్రామీణ రహదారులను హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. మొదటి విడతలో భాగంగా ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ ఈ నాలుగు జిల్లాల్లో రూ. 3,382 కోట్ల అంచనా వ్యయంతో 3,861 కిలోమీటర్ల మేర రహదారులను చేపడుతున్నట్లు చెప్పారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు పనులకు అనువైన సమయం కాబట్టి, కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

**ప్రతి మండనాలనికి ముగ్గురు సభ్యులతో కమిటీ:**

ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సింగూరు రిజర్వాయర్‌లో నీటి మట్టం తక్కువగా ఉన్నందున నిజాంసాగర్ నుంచి నీటిని తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రతి మండలానికి ముగ్గురు సభ్యులతో 'డ్రింకింగ్ వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీ' ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా గిరిజన, చెంచు పెంటలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లో పనుల కొరత రాకుండా ఉపాధి హామీ పథకానికి కేటాయించిన రూ. 6,000 కోట్ల బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. బాగా పనిచేసే అధికారులకు సన్మానాలు ఉంటాయి.. అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని మంత్రి అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మిలతో పాటు వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ ఐటీ, ఫైనాన్షియల్ హబ్‌గా వెలుగొందుతున్న గచ్చిబౌలిలోని విప్రో సర్కిల్‌లో భారత మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం ఘనంగా ఆవిష్కరించారు. రాష్ట్ర ఆర్థిక రంగానికి గుండెకాయ లాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని నెలకొల్పుకోవడం తెలంగాణ గర్వకారణమని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. పరిపాలనలో ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు, చూపిన దార్శనికత దేశ సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేశాయని కొనియాడారు. ఈ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం గర్వించదగిన అసలైన జాతిరత్నం డాక్టర్ మన్మోహన్ సింగ్ అని అభివర్ణించారు. ఒక మారుమూల గ్రామం నుంచి ప్రయాణం ప్రారంభించి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వరకు ఆయన విద్యాభ్యాసం సాగిందని తెలిపారు. విదేశాల్లో ఉన్నత చదువులు పూర్తి చేసినప్పటికీ, తన జ్ఞానం, మేధస్సు అంతా స్వదేశానికే ఉపయోగపడాలనే గొప్ప సంకల్పంతో ఆయన భారత్‌కు తిరిగి వచ్చారని గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్ జీవిత ప్రయాణం నేటి జెన్ జీ యువతతో పాటు రాబోయే అన్ని తరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తుందని చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, నాటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ద్వయం ఆలోచనల ఫలితమే 1991లో రూపుదిద్దుకున్న సరళీకృత ఆర్థిక విధానాలు అని రేవంత్ రెడ్డి కొనియాడారు. ఆనాడు పీవీ నేతృత్వంలో భారత్‌ను తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన ఘనత మన్మోహన్‌కే దక్కుతుందన్నారు. ఆ ఇద్దరు మేధావులు నాడు ధైర్యంగా తీసుకున్న నిర్ణయాల వల్లే ఇవాళ దేశం ఆర్థికంగా పటిష్ఠంగా నిలబడిందని, హైదరాబాద్‌లో ఇలాంటి ప్రపంచ స్థాయి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు, ఐటీ కారిడార్లు ఏర్పడటానికి వారి దూరదృష్టియే కారణమని స్పష్టం చేశారు. అలాగే 2013లో మన్మోహన్ ప్రభుత్వం తీసుకొచ్చిన చారిత్రాత్మక 'భూసేకరణ, పునరావాస చట్టం' రైతులు, నిర్వాసితుల హక్కులను కాపాడిన గొప్ప చట్టమని కొనియాడారు.

**భారతరత్న ఇవ్వడానికి అభ్యంతరమేంటి?**

తెలంగాణ ప్రజల దశాబ్దాల స్వరాష్ట్ర కలను నెరవేర్చడంలో మన్మోహన్ సింగ్ పాత్ర చిరస్మరణీయమని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్‌ల తర్వాత తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేని నేతలు సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ మాత్రమేనన్నారు. ప్రధాని హోదాలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర బిల్లుపై మన్మోహన్ సింగ్ సంతకం చేసి, నాలుగున్నర కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని చెప్పారు. దేశానికి ఇంతటి మహోన్నత సేవలుందించిన మన్మోహన్ సింగ్‌కు ఇప్పటివరకు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న ఇవ్వకపోవడం ఎంతో బాధాకరమని సీఎం విచారం వ్యక్తం చేశారు. "మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏంటి?" అని ఆయన ప్రశ్నించారు. సమర్థవంతమైన పాలనతో దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన ఆ మహనీయుడికి తక్షణమే భారతరత్న ప్రకటించాలని తెలంగాణ ప్రజల తరఫున కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కార స్వరం చాకలి ఐలమ్మ





**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, బహుజన ఆత్మగౌరవ ప్రతీక చిట్యాల (చాకలి) ఐలమ్మ జయంతి సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్ర శేఖర్ రావు ఆమె త్యాగాలను స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో చాకలి ఐలమ్మ తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కార స్వరమని, తెలంగాణకి ఆమె నిలువెత్తు నిదర్శనమని కేసీఆర్ కొనియాడారు. నాటి నిరంకుశ రాచరిక పాలనలో, భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా రైతాంగం న్యాయమైన హక్కుల కోసం గళమెత్తిన ధీరవనిత అని ప్రశంసించారు. ఒకవైపు భూస్వామ్య శక్తులను ఎదురిస్తూనే, మరోవైపు చట్టాల పరిధిలో న్యాయస్థానాల్లో న్యాయపోరాటం చేసి గెలిచిన ఆమె ప్రజాస్వామిక పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని పేర్కొన్నారు. ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రస్తుత అస్తవ్యస్త పాలనా పరిస్థితుల్లో ఐలమ్మ ప్రదర్శించిన ప్రజాస్వామిక పోరాట పంథా, తెలంగాణ సోయి నేటి యువతకు అనుసరణీయమని స్పష్టం చేశారు. తాను శాంతియుత మార్గంలో నడిపించిన మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఐలమ్మ అందించిన స్ఫూర్తి ఎంతగానో ఇమిడి ఉందని కేసీఆర్ గుర్తు చేశారు. ఆమె గొప్పతనాన్ని భావితరాలకు చాటేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించే సాంప్రదాయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పదేండ్ల పాలనలో ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా మహిళా, శిశు సంక్షేమం, రైతాంగ హక్కులు, కులవృత్తుల పునరుజ్జీవనం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి సబ్బండ వర్గాల ఆత్మగౌరవాన్ని సమున్నతంగా నిలబెట్టామని వివరించారు. తెలంగాణ రైతాంగం, సబ్బండ కులాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా నిబద్ధతతో పరిపాలన సాగించడం ద్వారా మాత్రమే చాకలి ఐలమ్మకు మనం నిజమైన నివాళి అర్పించినవారమౌతామని కేసీఆర్ స్పష్టం చేశారు.



# రైతు బీమా రద్దు చేసి పశువుల బీమా?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విరుచుకుపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన 'రైతు బీమా' పథకం ప్రీమియం చెల్లింపులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపణలు వస్తున్న వేళ ఇదే సమయంలో శనివారం కరీంనగర్ వేదికగా రాష్ట్రంలోని పాడి గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకల కోసం ప్రభుత్వం పశువుల బీమా పథకాన్ని ప్రారంభించడంపై కేటీఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు.

**రైతు బీమా రద్దు.. పశువుల బీమా ముద్దు:**

గత ఎనిమిదేళ్లుగా ఏదేని కారణంతో రైతు మరణిస్తే వారి కుటుంబాలకు ఆపద్బాంధవుగా నిలిచిన రైతు బీమాను పక్కనబెట్టడాన్ని కేటీఆర్ తప్పుపట్టారు. రైతు బీమా రద్దు.. పశువుల బీమా ముద్దు అంటూ ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ పాలన ప్రజాపాలన కాదని, తుగ్లక్ పాలనను తలపిస్తోందని దుయ్యబట్టారు. ఈ మేరకు నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం బర్కత్ పల్లి గ్రామానికి చెందిన రైతు ఒర్సు రాంచందర్ గుండెపోటుతో మరణించగా రైతు బీమా పథకం డబ్బుల కోసం అతడి కుటుంబ సభ్యులు ప్రయత్నించగా ఆగస్టు 14 నుంచి ఈ పథకం నిలిచిపోయిందని ఏఈఓ చెప్పినట్లు ప్రచురితమైన న్యూస్ పేపర్ క్లిప్పింగ్ ను కేటీఆర్ షేర్ చేశారు.

# ఈసీ బీజేపీ కార్యాలయం కాదు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

ఓటరు జాబితా సవరణలో వెలుగు చూసిన అంశాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో 'రిఫరీ'పైనే అనుమానం కలిగితే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల సంఘం స్వతంత్రతే పునాది అని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నీ కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని, రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటు హక్కు పరిరక్షణకు ఉద్యమిస్తామన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రత కోసం రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని, ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడే వరకు కాంగ్రెస్ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.

**ఎన్నికల సంఘం బీజేపీ కార్యాలయం కాదు:**

ఎన్నికల సంఘం బీజేపీ కార్యాలయం కాదని ఓటరు జాబితా కేంద్ర ప్రభుత్వ ఆస్తినో, అధికార పార్టీ సొత్తో కాదని కాదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు దేశ ప్రజల రాజ్యాంగ హక్కు అన్నారు. ఎన్నికల సంఘాన్ని బీజేపీ రాజకీయ పరికరంగా మార్చే ప్రయత్నాన్ని సహించమన్నారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి సీజేఐని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ప్రధాని సూచించిన కేంద్ర మంత్రిని కమిటీలో చేర్చి బీజేపీ మెజారిటీని ఖాయం చేసుకుందని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఆనాడు లేవనెత్తిన సందేహాలే నేడు దేశ ప్రజల ప్రశ్నలయ్యాయని ఎన్నికల కమిషనర్లు సంధు, జోషి లేవనెత్తినట్లు చెబుతున్న 14 అభ్యంతరాలపై సమాధానం చెప్పాలన్నారు.

**హక్కు చిన్నది కాదు:**

గోవాలో 97 మంది అర్హుల పేర్లు తుది జాబితాలో చేరకపోవడం తీవ్ర ఆందోళనకరం అని చట్టబద్ధ అధికారి అర్హత నిర్ధారించినా సాఫ్ట్‌వేర్ ఓటు హక్కును అడ్డుకోవడమేమిటి అని నిలదీశారు. గోవా ఉదంతానికి బాధ్యులెవరో ఎన్నికల సంఘం దేశ ప్రజలకు వెల్లడించాలన్నారు. ఓటర్ల సంఖ్య 97 కావచ్చు. సంఖ్య చిన్నదైనా హక్కు చిన్నది కాదన్నారు. ఒక్క అర్హుడి ఓటు హక్కును అడ్డుకున్నా అది ప్రజాస్వామ్యంపై దాడేనని మనిషి కోసం సాంకేతికత ఉండాలి తప్పా సాంకేతికత కోసం ఓటు హక్కును బలి ఇవ్వొద్దన్నారు. 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా పేర్ల తొలగింపుపై పారదర్శకత అవసరం అని పశ్చిమ బెంగాల్‌లో 22.21 లక్షల మంది పేర్ల పునరుద్ధరణకు అప్పీలు చేయడం చిన్న విషయం కాదన్నారు.

**రైలు వెళ్లిపోయాక టికెట్ ఇచ్చినట్లు..**

ఎన్నికల తర్వాత పేరు సరిచేస్తే ప్రయోజనం ఏమిటి? ఓటింగ్‌కు ముందే న్యాయం జరగాలన్నారు. రైలు వెళ్లిపోయిన తర్వాత టికెట్ ఇచ్చినట్లు ఎన్నికల తర్వాత ఓటు హక్కును పునరుద్ధరించడం ఏంటని ప్రశ్నించారు. 'అన్ని నిర్ణయాలు ఏకగ్రీవం' అనే ఒక్క మాటతో కమిషనర్ల అభ్యంతరాలు మాయమైపోవని వివాదాస్పద నిర్ణయాలను ఎవరు అనుమతించారో ఎన్నికల సంఘం బహిర్గతం చేయాలన్నారు. గోవా ఘటనతోపాటు ఓటరు జాబితాల సాంకేతిక వ్యవస్థపై నిష్పాక్షిక విచారణ జరపాలని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఎన్నికల ప్రక్రియను నమ్మాలని ప్రజలను ఆదేశించలేరన్నారు.

# రేవంత్ రెడ్డి నిజాయితీ గల మోసగాడు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాయితీ గల మోసగాడు అని ప్రజలు నమ్ముతారని రేవంత్ రెడ్డి ముందే చెప్పారని చెప్పినట్లే మళ్లీ పాతరోజులు తెచ్చి చూయిస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రజలు పాలించే బర్రెను వదులుకుని, తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్‌కు సమయం ఇచ్చారని, మూడేళ్లు ఆయన ప్రజల ముందుకు రాకపోయినా గల్లీ గల్లీలో కేసీఆర్ పాటలే వినిపిస్తున్నాయన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గ్రామానికి చెందిన సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**రైతుబంధు ఎగ్గొట్టి హామీలు విస్మరించారు:**

కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే నేరుగా ఖాతాల్లో రైతుబంధు పడేదని గుర్తుచేసిన కేటీఆర్.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిందని విమర్శించారు. 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలతో పాటు అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పి, ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఎవరు గెలిచినా కేసీఆరే సీఎం అవుతారని సంక్షేమ పథకాలు బంద్ కావని ప్రజలు అనుకున్నారు. కానీ 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' రాష్ట్ర ప్రజల పరిస్థితి తయారైందన్నారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేస్తే గెలిచిన నాయకుడు కనబడకుండా పోయాడని ఎద్దేవా చేశారు.

**2028లో బీఆర్ఎస్‌దే అధికారం:**

రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయం మారబోతోందని 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పలు సర్వేలు స్పష్టం చేస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ దోపిడీ, అవినీతి పాలనకు చరమగీతం పాడాల్సిన బాధ్యత ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. సెప్టెంబర్ 28 నుంచి ప్రారంభమయ్యే పట్టభద్రుల (గ్రాడ్యుయేట్స్) ఓటు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొని, కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుంది

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని నిలబెడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ పార్టీ మార్పు అంశంపైనా ఆమె స్పందించారు. ఓ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయడాన్ని తప్పుబట్టారు. ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణపైనా కవిత స్పందించారు. క్లరికల్ తప్పిదాల కారణంగా అధికారులు ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని అన్నారు. బీజేపీ ప్రోత్సాహంతో కుట్రపూరితంగా ఓట్ల తొలగింపు జరుగుతోందనే చర్చ ప్రజల్లో ఉందని కవిత పేర్కొన్నారు.

**ఆదిలాబాద్ రిమ్స్ ఘటన బాధాకరం..**

ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఆదిలాబాద్ రిమ్స్‌లో చిన్నారుల మరణాలు అత్యంత బాధాకరమని అన్నారు. తెలంగాణలో విద్య, వైద్య రంగాలను ప్రభుత్వం సరిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చిన్నారుల మరణాలపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్య సేవలు సరిగా అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. నిమ్స్, నీలోఫర్ వంటి ఆస్పత్రుల్లో మంత్రులు ఫోన్ చేసినా బెడ్లు దొరకని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. పదకొండు రకాల ఆరోగ్య పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించలేదని కవిత ఆరోపించారు. ఆరోగ్యశ్రీ బకాయిలనూ ఇప్పటికీ విడుదల చేయలేదని మండిపడ్డారు.

**పిల్లలు చనిపోతుంటే సింగపూర్ ఎలా చేస్తారు..**

ప్రభుత్వ ఆస్పత్రులను మంత్రులు పట్టించుకోవడం లేదని కవిత విమర్శించారు. ప్రభుత్వ హాస్టళ్లు, ఆస్పత్రులను ఆయా జిల్లాల కలెక్టర్లు క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. ప్రతి జిల్లాలో తెలంగాణ రక్షణ సేన తరఫున ప్రభుత్వ వైద్య సంస్థలను సందర్శించి పరిస్థితులను పరిశీలిస్తామని తెలిపారు. ఇంతమంది చిన్నారులు మరణిస్తుంటే తెలంగాణను డల్లాస్, సింగపూర్ తరహాలో అభివృద్ధి చేస్తామని ఎలా చెబుతారని సీఎం, మంత్రులను ప్రశ్నించారు. మరోవైపు, ఐటీడీఏకు కేంద్రం నుంచి వచ్చిన నిధుల్లో 70 శాతం వినియోగించలేదని కవిత ఆరోపించారు. కోఠి ఆస్పత్రిలో మిడ్‌డే మీల్స్ ఏర్పాటు చేస్తామన్న ప్రతిపాదనను గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనుమతించలేదని పేర్కొన్నారు.

**నా ఫామ్‌హౌస్ కబ్జా భూమిలో లేదు..**

తన ఫామ్‌హౌస్‌పై వస్తున్న ఆరోపణలను కవిత ఖండించారు. అక్కడ ఎలాంటి అక్రమ భూములు లేవని, ఇనాం, కబ్జా లేదా అసైన్డ్ భూమి లేదని చెప్పారు. తన ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదని, తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం ద్వారా అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఫామ్‌హౌస్‌కు వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కవిత పేర్కొన్నారు.




# కేంద్ర ఎన్నికల సంఘం భేటీ..

**ఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘంలో ఇటీవల ప్రధాన అధికారుల మధ్య విభేదాలు నెలకొన్నాయనే వార్తల నేపథ్యంలో ఈసీ ఉన్నతాధికారులు అత్యవసరంగా భేటీ అయ్యారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈసీ పరిధిలోని అంతర్గత అంశాలు, ఇటీవల కమిషనర్ల మధ్య వచ్చిన అభిప్రాయ భేదాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చిస్తున్నట్లు సమాచారం. కమిషన్ పనితీరు సమర్థవంతంగా సాగేలా అధికారుల మధ్య సమన్వయాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించారు. మరోవైపు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి సాధారణ ప్రజలు, ఓటర్లకు పెద్ద ఉపశమనం కలిగించే కీలక నిర్ణయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు సదరు వివరాలు లేదా పత్రాలు సమర్పించేందుకు బూత్ లెవెల్ ఆఫీసర్ల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఈసీ స్పష్టం చేసింది. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు ఇంటికే నేరుగా బిఎల్ఓ లు వెళ్లాలని అధికారులను ఆదేశించింది. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బిఎల్ఓలే స్వయంగా ఇళ్లకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లు, ఆధారాలను పరిశీలించి సేకరిస్తారు. వాళ్లే ఆన్లైన్లో అవసరమైన డాక్యుమెంట్లు అప్ లోడ్ చేస్తారని పేర్కొంది. ఓటర్లు కార్యాలయాల వద్ద క్యూలలో నిలబడి ఇబ్బందులు పడకుండా చూసేందుకే ఈ కీలక మార్పులు చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

# పూరిగుడిసెలు లేని రాష్ట్రంగా...

**జనగామ,ఫ్లాష్ ఇండియా :** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్రంలో పూరిగుడిసెలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థుల కోసం హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచడంతో పాటు ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థలను నిర్మిస్తున్నామని చెప్పారు.

**తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు**

రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దసరా నాటికి 2.18 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేశామని, జనగామ నియోజకవర్గానికి కూడా అదే సంఖ్యలో ఇళ్లు కేటాయించామని తెలిపారు. లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణ పనుల దశలను బట్టి ప్రతి సోమవారం వారి ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేసి ప్రతి నియోజకవర్గానికి మరో 2,000 ఇళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. జనగామ నియోజకవర్గంలో గుర్తించిన 500 పూరిగుడిసెల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, మొండిగోడలు, స్లాబ్ స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని కూడా రెండో విడతలో చేపడుతున్నామని చెప్పారు.

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రూ.2 కోట్లు**

గతంలో నిర్మాణం పూర్తికాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. జనగామలో ఇందుకోసం రూ.2 కోట్లు వెంటనే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దసరా నాటికి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. జనగామ మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి తొలి విడతగా రూ.25 కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఇప్పటికే శంకుస్థాపన చేసిన రూ.58-60 కోట్ల అభివృద్ధి పనులు, టెండర్లు పూర్తయిన రూ.19 కోట్ల పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**పేదల సంక్షేమమే ప్రాధాన్యత**

మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గతంలో సేకరించిన ప్రభుత్వ ఇళ్ల స్థలాలను గుర్తించి అర్హులకు పంపిణీ చేసి, తదుపరి విడతల్లో అక్కడ ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.70 వేల కోట్లకు పైగా సున్నా వడ్డీ రుణాలు అందించామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. రైతు భరోసా కొనసాగిస్తున్నామని, వరి రైతులకు మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి, మరో 14-15 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసినట్లు వెల్లడించారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అర్హులైన పేదలకే ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జనగామ మున్సిపాలిటీలో రూ.18.90 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తయ్యాయని, పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. వడ్లకొండ--శామీర్‌పేట్ బైపాస్ రోడ్డును డబుల్ లైన్ చేయడంతో పాటు చీటకోడూరు బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలని, గండిరామారం పంపులను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి మాట్లాడుతూ చీటకోడూరు డ్యామ్ పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం 500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరాం, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో బడుగు అభివృద్ధికి కృషి..

**ఆసిఫాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగలతో కలిసి హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, తనకు ఎదురైన అవమానాలకు, నష్టాలకు ఎదురొడ్డి బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆనాటి భూస్వాములు, రజాకార్లపై వీరోచిత పోరాటం చేశారని తెలిపారు. నేటి తరానికి చాకలి ఐలమ్మ ఆదర్శనీయమని, ఐలమ్మ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్, చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామని తెలిపారు.

## సంపాదకీయం

# సామాన్యుడి నడ్డి విరుస్తున్న బాదుడు




సామాన్యుడి సంపాదన పరిమితం.. కానీ ఖర్చులకు మాత్రం హద్దు ఉండటం లేదు. ఉదయం నిద్రలేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు మనం చేసే ప్రతి పనిలోనూ ఏదో ఒక రూపంలో పన్ను, ఫీజు లేదా సర్వీస్ చార్జీ ఎదురవుతోంది. కొన్ని చార్జీలు మనకు స్పష్టంగా కనిపిస్తాయి. మరికొన్ని మాత్రం బిల్లులో చిన్న అక్షరాల్లో కనిపిస్తాయి. ఇంకొన్ని మనకు తెలియకుండానే వస్తువులు, సేవల ధరల్లో కలిసిపోతాయి. నెలాఖరులో జీతం ఎంత వచ్చింది అని లెక్కపెట్టుకునే సామాన్యుడు.. అదే సమయంలో ఏ రూపంలో ఎంత ఖర్చు చేశాడో లెక్క వేసుకుంటే అసలు పరిస్థితి అర్థమవుతుంది.ఒకప్పుడు పన్ను అంటే ఆదాయపు పన్ను, అమ్మకపు పన్ను వంటి కొన్ని విషయాలకే పరిమితమైందనే భావన ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. జీఎస్టీ నుంచి సర్వీస్ చార్జీల వరకు, బ్యాంకింగ్ రుసుముల నుంచి డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఫీజుల వరకు ఎన్నో రకాల ఖర్చులు మన జీవితంలో భాగమయ్యాయి. ఒక హోటల్‌కు వెళ్లి భోజనం చేస్తే ఆహారం ధరతో పాటు వర్తించే పన్నులు ఉంటాయి. అదే ఆహారాన్ని ఆన్‌లైన్‌లో ఇంటికి తెప్పించుకుంటే డెలివరీ ఫీజు, ప్లాట్‌ఫామ్ ఫీజు వంటి అదనపు ఖర్చులు ఉండొచ్చు. అంటే ఒకే వస్తువు లేదా సేవను పొందే విధానం మారితే ఖర్చు నిర్మాణం కూడా మారుతోంది.ఇక్కడ సామాన్యుడి మనసులో ఒక సహజమైన ప్రశ్న వస్తుంది. ప్రభుత్వాలకు ఆదాయం అవసరం. సంస్థలకు సేవలు అందించడానికి ఖర్చులు ఉంటాయి. బ్యాంకులు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, డెలివరీ సంస్థలు కూడా తమ నిర్వహణ ఖర్చులను భరించాలి. ఇవన్నీ నిజమే. కానీ ఆ ఖర్చుల భారం చివరకు వినియోగదారుడి మీద ఎంతవరకు పడుతోంది? ఒక సేవకు చెల్లించే మొత్తం ఎంత? అందులో అసలు ధర ఎంత? పన్ను ఎంత? ఇతర రుసుములు ఎంత? అన్నది సామాన్యుడికి స్పష్టంగా తెలియాలి.బ్యాంకింగ్ రంగాన్ని తీసుకుంటే.. ఏటీఎం వినియోగం, కార్డు సేవలు, ఎస్ఎంఎస్ అలర్టు, కొన్ని ఖాతా సేవలు, రుణాలకు సంబంధించిన వివిధ సేవలపై రుసుములు ఉండవచ్చు. ఒక్కోటి చిన్న మొత్తంలా అనిపించినా.. సంవత్సరానికి మొత్తం లెక్కిస్తే గణనీయమైన ఖర్చుగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ చిన్నచిన్న రుసుములే అదనపు భారంగా మారుతాయి. అందుకే బ్యాంకులు ఏ సేవకు ఎంత రుసుము తీసుకుంటున్నాయో వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది.డిజిటల్ చెల్లింపులు వచ్చిన తర్వాత ప్రజల జీవన విధానమే మారిపోయింది. చేతిలో నగదు లేకపోయినా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి క్షణాల్లో చెల్లించగలుగుతున్నాం. కూరగాయల బండి నుంచి పెద్ద షాపింగ్ మాల్ వరకు యూపీఐ చెల్లింపులు సాధారణమయ్యాయి. చిన్న మొత్తాల నుంచి పెద్ద లావాదేవీల వరకు డిజిటల్ పేమెంట్స్‌పై ప్రజల ఆధారపడటం పెరిగింది. సౌకర్యం, వేగం, నగదు అవసరం లేకపోవడం వంటి కారణాలతో ఈ విధానం విస్తరించింది.అయితే వ్యాపార చెల్లింపులకు సంబంధించిన రుసుములపై ఎప్పటికప్పుడు చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మర్చంట్ డిస్కౌంట్ రేట్ వంటి ఛార్జీలు ఉంటే వాటిని ఎవరు భరిస్తారు? వ్యాపారులపై పడే ఖర్చును వారు చివరకు వస్తువుల ధరల్లోకి బదిలీ చేస్తారా? అనే ప్రశ్నలు సహజంగానే వస్తాయి. రుసుము నేరుగా వినియోగదారుడి ఖాతా నుంచి కట్ కాకపోయినా.. వ్యాపారి తన ఖర్చులు పెరిగాయని భావించి ధరలను మార్చితే పరోక్షంగా ఆ భారాన్ని కస్టమరే మోయాల్సి రావచ్చు. అందుకే ఇలాంటి విధానాలపై పూర్తి పారదర్శకత అవసరం.ఇదే సమస్య ఆన్‌లైన్ షాపింగ్, ఫుడ్ డెలివరీ, కిరాణా డెలివరీ సేవల్లోనూ కనిపిస్తుంది. యాప్‌లో కనిపించే వస్తువు ధర ఒకటైతే.. చివర్లో బిల్లులో మరో కొన్ని రకాల ఫీజులు కనిపిస్తాయి. డెలివరీ ఫీజు, ప్లాట్‌ఫామ్ ఫీజు, హ్యాండ్లింగ్ ఫీజు, ఇతర రుసుములు కలిసే సరికి మొదట కనిపించిన ధర కంటే తుది బిల్లు ఎక్కువవుతుంది. వినియోగదారుడు ఆర్డర్ చేసే ముందు మొత్తం చెల్లించాల్సిన మొత్తాన్ని స్పష్టంగా చూడగలిగే విధంగా వ్యవస్థ ఉండటం చాలా ముఖ్యం.అయితే ప్రతి అదనపు రుసుమును ప్రభుత్వ బాదుడుగా, ప్రతి ఆన్‌లైన్ ఛార్జీని దోపిడీగా చెప్పడం కూడా సరైన విశ్లేషణ కాదు. పన్నులకు చట్టపరమైన కారణాలు ఉంటాయి. సేవల నిర్వహణకు సంస్థలకు ఖర్చులు ఉంటాయి. వ్యాపార సంస్థలు కూడా తమ కార్యకలాపాల నిర్వహణ కోసం కొన్ని ఫీజులు వసూలు చేయవచ్చు. కానీ వినియోగదారుడికి ముఖ్యమైన విషయం.. తాను ఏ సేవకు ఎంత చెల్లిస్తున్నాడో స్పష్టంగా తెలుసుకోవడం.ప్రజల విషయంలో కూడా బాధ్యత ఉంది. బిల్లు చూసుకోకుండా చెల్లించడం, నిబంధనలు చదవకుండా సేవలు వినియోగించడం వల్ల అనవసర ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. బ్యాంకు స్టేట్‌మెంట్లు పరిశీలించడం, ఆన్‌లైన్ ఆర్డర్‌లో చివరి బిల్లును చూడటం, ఏ సేవకు ఎంత రుసుము పడిందో తెలుసుకోవడం వంటి చిన్న అలవాట్లు చాలా ఉపయోగపడతాయి. అవసరం లేని సబ్‌స్క్రిప్షన్లు, ఆటోమేటిక్ పేమెంట్లు, అదనపు సేవలను కూడా ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి.అదే సమయంలో ప్రభుత్వాలు, బ్యాంకులు, డిజిటల్ సంస్థలు కూడా ప్రజల నమ్మకాన్ని కాపాడుకోవాలి. పన్ను లేదా రుసుము ఎందుకు విధిస్తున్నారు? దాని ప్రయోజనం ఏమిటి? ఎవరికి వర్తిస్తుంది? ఎంత మొత్తం వసూలు చేస్తారు? వంటి విషయాలను సులభమైన భాషలో ప్రజలకు తెలియజేయాలి. చార్జీల విషయంలో పారదర్శకత ఉంటే అనవసర అనుమానాలు తగ్గుతాయి.ఎందుకంటే సామాన్యుడికి సమస్య ఒక్క పెద్ద పన్నుతో మాత్రమే రాదు. చిన్నచిన్న ఖర్చులు కలిసి పెద్ద భారంగా మారతాయి. ఒకచోట పది రూపాయలు, మరోచోట ఇరవై రూపాయలు, ఇంకోచోట యాభై రూపాయలు.. ఇలా నెలంతా జరిగే లావాదేవీలను కలిపితే కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం పడుతుంది. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు పెరుగుతుంటే మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలపై ఒత్తిడి పెరుగుతుంది.కాబట్టి ఇది కేవలం ప్రభుత్వాలను విమర్శించే అంశం కాదు. ఇది ప్రజల డబ్బు, పారదర్శకత, బాధ్యతకు సంబంధించిన అంశం. ప్రభుత్వాలకు ఆదాయం అవసరం.. సంస్థలకు నిర్వహణ ఖర్చులు అవసరం.. వినియోగదారులకు మాత్రం తమ డబ్బు ఎక్కడికి వెళ్తుందో తెలుసుకునే హక్కు ఉంది.పన్ను చెల్లించడం పౌర బాధ్యత కావచ్చు. సేవలకు న్యాయమైన రుసుము చెల్లించడం కూడా సహజమే. కానీ ప్రతి రుసుము వెనుక కారణం ఏమిటో ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి. ఒక సేవ పేరుతో అనేక రకాల చార్జీలు కనిపించినప్పుడు వాటిపై ప్రశ్నించే అవకాశం ఉండాలి.చివరికి మనం గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే. సామాన్యుడి జేబులో నుంచి బయటకు వెళ్లే ప్రతి రూపాయి చిన్నదే కావచ్చు.. కానీ వేలాది రూపాయలు, లక్షల కుటుంబాల విషయంలో అదే చిన్న మొత్తం పెద్ద భారంగా మారుతుంది. అందుకే పన్నులైనా, ఫీజులైనా, చార్జీలైనా.. అవి న్యాయబద్ధంగా, పారదర్శకంగా, ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉండాలి. ప్రజలు కూడా తమ బిల్లులను పరిశీలించాలి, తమ హక్కులను తెలుసుకోవాలి, అవసరమైన చోట ప్రశ్నించాలి.డిజిటల్ యుగం మన జీవితాలను సులభతరం చేయాలి.. ఖర్చుల లెక్కలను మాత్రం మరింత క్లిష్టం చేయకూడదు. ప్రభుత్వాలు, సంస్థలు, వినియోగదారులు.. ముగ్గురూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే ఆర్థిక వ్యవస్థలో నమ్మకం పెరుగుతుంది. చెల్లించడం మాత్రమే కాదు.. ఎందుకు చెల్లిస్తున్నామో తెలుసుకోవడం కూడా ప్రతి పౌరుడి హక్కు.





# ఆ రోజు జరిగిన అవమానమే..

12ఏళ్ల వయసులో ఒక అమ్మాయి జీవితంలో జరిగిన ఒక అవమానం.. 24ఏళ్ల తర్వాత ఒక దేశం చరిత్రలో నిలిచిపోయే విజయానికి కారణమవుతుందని అప్పట్లో ఎవరూ ఊహించి ఉండరు. ఢిల్లీలోని ఒక చిన్న సెలూన్‌లో జరిగిన ఆ ఘటనతో ఆ చిన్నారి ప్రపంచం ఒక్కసారిగా మారిపోయింది. తనను తాను కాపాడుకోలేకపోయాననే నిస్సహాయత ఆమెను లోపల నుంచి కుదిపేసింది. భయం ఆమెను వెనక్కి లాగలేదు. అదే భయం ఆమె చేతుల్లో బలంగా మారింది. తనను తాను రక్షించుకోవాలి.. ఎవరిమీదా ఆధారపడకుండా నిలబడాలి.. తన శరీరమే తనకు కవచంగా మారాలి అనే నిర్ణయం తీసుకుంది. ఆ రోజు మొదలైన ఆ ప్రయాణం చివరకు ఆమెను ఏకంగా ఆసియా క్రీడల వేదికపై నిలబెట్టింది. ఆ అమ్మాయి పేరు సుచికా తరియాల్.36ఏళ్ల వయసులో సుచికా తరియాల్ సాధించిన ఈ విజయం కేవలం ఒక పతకం కాదు. 24ఏళ్లుగా ఆమె మోస్తున్న కలకు దొరికిన సమాధానం. ఎన్నో క్రీడలు.. ఎన్నో గాయాలు.. ఎన్నో ఓటములు.. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు.. ఎన్నో సార్లు ఆగిపోవాల్సిన పరిస్థితులు.. అయినా ప్రతిసారీ మళ్లీ లేచి నిలబడిన ఒక మహిళ ప్రయాణానికి ఇది గుర్తింపు. భారత క్రీడా చరిత్రలోనే తొలిసారి ఆసియా క్రీడల్లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో భారత్‌కు పతకం అందించిన క్రీడాకారిణిగా సుచికా తరియాల్ పేరు చరిత్రలో నిలిచిపోయింది.ఆసియా క్రీడలు 2026లో మహిళల ట్రెడిషనల్ 60 కిలోల విభాగంలో మంగోలియాకు చెందిన అల్టాంచిమెగ్ బైగాల్మాను 2-0 తేడాతో ఓడించి సుచికా సెమీఫైనల్‌కు చేరుకుంది. అక్కడ సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియోతో జరిగిన పోరు సాధారణ సమయాన్ని దాటి అదనపు సమయానికి వెళ్లింది. చివరకు పోరు డ్రాగా ముగిసింది. విజేతను నిర్ణయించేందుకు ఉదయం జరిగిన బరువు కొలతను పరిగణనలోకి తీసుకున్నారు. టియో సుమారు 700 గ్రాములు తక్కువ బరువుతో ఉండటంతో ఫలితం ఆమెకు అనుకూలంగా మారింది.అక్కడే సుచికా కన్నీళ్లు పెట్టుకుంది. ఒక నిర్ణయాన్ని అంగీకరించలేక మైదానంపైనే కుప్పకూలిపోయింది. రిఫరీ దగ్గరకు వెళ్లేందుకు కూడా ఆమె మొదట నిరాకరించింది. ఆ క్షణం చూసినవారికి అది ఒక ఓడిపోయిన క్రీడాకారిణి బాధలా కనిపించి ఉండొచ్చు. కానీ సుచికా కన్నీళ్ల వెనుక ఒక సెమీఫైనల్ ఓటమి మాత్రమే లేదు. ఆ కన్నీళ్ల వెనుక 24ఏళ్ల ప్రయాణం ఉంది. 12ఏళ్ల వయసులో మొదలైన పోరాటం ఉంది. ఎన్నిసార్లు జీవితమే తనను కిందికి లాగినా మళ్లీ లేచి నిలబడిన ఒక మహిళ కథ ఉంది.ఆ కథను అర్థం చేసుకోవాలంటే మళ్లీ ఆ 12ఏళ్ల సుచికా దగ్గరకు వెళ్లాలి. ఢిల్లీలోని ఒక సెలూన్‌లో జరిగిన లైంగిక వేధింపుల ఘటన ఆమెను తీవ్రంగా కలిచివేసింది. ఒక చిన్నారిగా తనకు జరిగిన ఆ అనుభవం ఆమెకు ఒక చేదు నిజాన్ని నేర్పించింది. ప్రపంచం ఎప్పుడూ మనల్ని కాపాడటానికి ముందుకు రాదు. కొన్ని సందర్భాల్లో మనల్ని మనమే కాపాడుకోవాలి. అదే ఆలోచన ఆమె జీవితాన్ని మరో దిశలోకి తిప్పింది.అప్పుడు ఆమె దగ్గర పెద్ద జిమ్ లేదు. ప్రత్యేకమైన ట్రైనర్ లేదు. ఖరీదైన పరికరాలు లేవు. కానీ ఒక నిర్ణయం ఉంది. బలంగా మారాలనే పట్టుదల ఉంది. కుటుంబం నివసించే ప్రభుత్వ క్వార్టర్స్ దగ్గర ఖాళీగా ఉన్న ఇంటికి వెళ్లి చినప్స్ చేసేది. పుష్ అప్స్ చేసేది. నాలుగో అంతస్తు వరకు నీళ్ల బకెట్లు మోసుకెళ్లేది. తన శరీరాన్ని తానే తీర్చిదిద్దుకుంది. ఎవరో తనకు శక్తిని ఇచ్చే వరకు ఎదురుచూడలేదు. తన బలాన్ని తానే నిర్మించుకుంది. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జూడో శిక్షణలోకి అడుగుపెట్టింది. మొదట తనను తాను రక్షించుకోవడానికి నేర్చుకున్న ఆ విద్య.. కొంతకాలానికి ఆమె జీవితాన్నే మార్చేసే వృత్తిగా మారిపోయింది. అయితే ఆ మార్గం కూడా సులభం కాదు. ఒక అమ్మాయి బయటకు వెళ్లి క్రీడల్లో పాల్గొనడం పట్ల కుటుంబంలోనే అభ్యంతరాలు ఎదురయ్యాయి. ముఖ్యంగా ఆమె అమ్మమ్మ మహిళలు ఇంటి బయటకు వెళ్లకూడదనే ఆలోచనతో ఉండేవారు. కానీ సుచికా మాత్రం ఆగలేదు.ఆమెకు ప్రతి అడుగు ఒక సమాధానం. ప్రతి గాయం ఒక పాఠం. ప్రతి ఓటమి మరోసారి లేచి నిలబడటానికి ఒక కారణం. అలా జూడోలో సుచికా 8సార్లు జాతీయ ఛాంపియన్‌గా నిలిచింది. ఇరవైకి పైగా అంతర్జాతీయ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. 2019 కామన్వెల్త్ జూడో ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం సాధించింది. అదే ఏడాది సౌత్ ఏషియన్ గేమ్స్‌లోనూ స్వర్ణ పతకం గెలిచింది. 2018 కామన్వెల్త్ జూడో ఛాంపియన్‌షిప్స్‌లో రజతం సాధించింది. 2022లో బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ తరఫున బరిలోకి దిగింది.కానీ సుచికా ప్రయాణం ఒక్క క్రీడతో ఆగిపోలేదు. జూడో ఆమెకు ఆరంభం మాత్రమే. 2023లో హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో కురాష్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఆ తర్వాత జుజిట్సు వైపు అడుగులు వేసింది. 2024లో జీజేఐఎఫ్ జుజిట్సు ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో 63 కిలోల కాంటాక్ట్ విభాగంలో స్వర్ణం సాధించి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. అప్పటికే ఎన్నో పోరాటాలను చూసిన ఆమె కెరీర్‌కు మరో ప్రపంచ స్థాయి విజయాన్ని జోడించింది.మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లోకి ఆమె అడుగుపెట్టింది అంతకంటే ముందే. 2017లో తన ప్రొఫెషనల్ అరంగేట్రంలోనే సబ్మిషన్ ద్వారా విజయం సాధించింది. ఆ తర్వాత కొంతకాలం పోటీ క్రీడలకు దూరమైంది. కానీ 2024లో మళ్లీ ప్రొఫెషనల్ పోటీల్లోకి వచ్చింది. బ్రేవ్ కాంబాట్ ఫెడరేషన్‌తో ఒప్పందం చేసుకుంది. ఆసియా ఎంఎంఏ ఛాంపియన్‌షిప్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించింది. చివరకు 2026 ఆసియా క్రీడల వేదికపై భారతదేశానికి ఒక చారిత్రాత్మకమైన తొలి ఎంఎంఏ పతకాన్ని అందించింది.అయితే సుచికా కథలో మైదానం వెలుపల కూడా ఎన్నో పోరాటాలున్నాయి. ఆమె సీఐఎస్ఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసింది. ప్రస్తుతం హర్యానా క్రీడా శాఖలో జూనియర్ కోచ్‌గా సేవలందిస్తోంది. రోడీస్, ఇండియాస్ అల్టిమేట్ వారియర్ వంటి రియాలిటీ కార్యక్రమాల్లోనూ కనిపించింది. కానీ బయటికి కనిపించే ఈ విజయాల వెనుక ఆర్థిక పోరాటం కూడా అంతే పెద్దది.అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు చాలాసార్లు తన సొంత డబ్బును ఖర్చు చేసింది. అప్పులు చేసింది. అవసరమైన సందర్భాల్లో తన భర్త క్రెడిట్ కార్డును ఉపయోగించింది. ఒక క్రీడాకారిణిగా ప్రపంచ స్థాయిలో పోటీ పడటం ఎంత కష్టం అయితే, ఆ పోరాటానికి కావాల్సిన డబ్బును సమకూర్చుకోవడం కూడా అంతే కష్టం. అయినా ఆమె ఆగలేదు. ఆ సమయంలో ఆమె జీవితంలో ఒక వ్యక్తి అండగా నిలిచాడు. ఆమె భర్త కపిల్ హుడా. వివాహం తర్వాత కూడా క్రీడను వదిలిపెట్టకుండా ముందుకు సాగాలని ప్రోత్సహించిన వ్యక్తిగా సుచికా తన భర్త గురించి మాట్లాడింది. చిన్ననాటి ఘటన తనకు పురుషులపై నమ్మకాన్ని కోల్పోయేలా చేసిందని, ఆ అనుభవం తనను డిప్రెషన్‌లోకి కూడా నెట్టిందని ఆమె చెప్పింది. అలాంటి పరిస్థితుల్లో కపిల్, ఆయన కుటుంబం ఇచ్చిన మద్దతు తన జీవితంలో ఎంతో ముఖ్యమైందని ఆమె చెప్పింది.ఎందుకంటే కొన్ని గాయాలు శరీరంపై కనిపించవు. అవి మనలోనే ఉంటాయి. కాలం గడిచినా వాటి జ్ఞాపకాలు మన వెంట వస్తూనే ఉంటాయి. సుచికా అలాంటి గాయాలతోనే పెరిగింది. కానీ వాటిని తన జీవితానికి ముగింపుగా చూడలేదు. అదే గాయాలను తన బలానికి మొదటి మెట్టుగా మార్చుకుంది. ఆమె ఎన్నోసార్లు క్రీడను వదిలేయాలనుకున్న సందర్భాలు వచ్చాయి. పరిపాలనా మార్పులు ఆమె దారిని అడ్డుకున్నాయి. నిధుల సమస్యలు వచ్చాయి. గాయాలు వెంటాడాయి. అవకాశాలు మారిపోయాయి. ఒక దశలో జుజిట్సు ద్వారా 2026 ఆసియా క్రీడలకు చేరుకునే మార్గమే జట్టు నిర్మాణంలో వచ్చిన మార్పులతో మూసుకుపోయింది.అక్కడే చాలామంది వెనక్కి తగ్గేవారు. కానీ సుచికా మరోసారి మార్గాన్ని మార్చుకుంది. ఈసారి ఆమె ఎంఎంఏ వైపు అడుగేసింది. జీవితం తనకు తలుపు మూసిన ప్రతిసారీ సుచికా మరో తలుపు వెతుక్కుంది. క్రీడ మారింది. వేదిక మారింది. ప్రత్యర్థులు మారారు. నియమాలు మారాయి. కానీ ఆమె లక్ష్యం మాత్రం మారలేదు. ఒకప్పుడు తనను తాను రక్షించుకోవడానికి జూడో నేర్చుకున్న పన్నెండేళ్ల బాలిక... ఇప్పుడు వేలాది మంది చూస్తున్న ఆసియా క్రీడల వేదికపై భారతదేశం తరఫున పోరాడుతోంది.చివరకు నాగోయా ఆమెను ఆహ్వానించింది. 24ఏళ్ల క్రితం ఒక చిన్నారి గుండెల్లో పుట్టిన ప్రశ్నకు నాగోయా ఒక సమాధానం ఇచ్చింది. ఒకప్పుడు తనను తాను కాపాడుకోలేకపోయాననే బాధతో బలం కోసం వెతికిన ఆ అమ్మాయి... ఇప్పుడు తన దేశానికి చరిత్రలో ఎప్పుడూ లేని ఒక పతకాన్ని అందించింది. ఆమె చేతికి వచ్చినది కేవలం కాంస్య పతకం. కానీ ఆ పతకం వెనుక ఉన్న కథ మాత్రం బంగారం కంటే విలువైనది. ఎందుకంటే అది ఒక పోరాటం గెలిచిన కథ మాత్రమే కాదు. పడిపోయిన ప్రతిసారీ లేచిన కథ. దారి మూసుకుపోయిన ప్రతిసారీ మరో దారి వెతికిన కథ. డబ్బు లేకపోయినా కలను వదులుకోని కథ. గాయాలు వచ్చినా అడుగులు ఆపని కథ. గతం వెంటాడినా భవిష్యత్తు వైపు పరుగెత్తిన కథ.పన్నెండేళ్ల వయసులో తనను తాను కాపాడుకోవాలని మొదలైన ప్రయాణం... ముప్పై ఆరేళ్ల వయసులో ఒక దేశం క్రీడా చరిత్రను మార్చే స్థాయికి చేరుకుంది. సుచికా తరియాల్ మనకు చెప్పిన గొప్ప విషయం ఇదే. జీవితం మనపై వేసిన ప్రతి గాయం మన బలహీనతగా మిగలాల్సిన అవసరం లేదు. కొన్ని గాయాలు మనలోని శక్తిని మేల్కొలుపుతాయి. మనల్ని కిందికి లాగే పరిస్థితులే ఒకరోజు మనల్ని పైకి తీసుకెళ్లే మెట్లుగా మారవచ్చు. ఒకప్పుడు తనను తాను రక్షించుకోవడం కోసం మొదలైన పోరాటం.. చివరకు దేశం గర్వపడే విజయంగా మారింది.అందుకే సుచికా తరియాల్ కథలో అసలైన విజయం ఆ కాంస్య పతకం కాదు. పతకం రాకముందే ఆమె గెలిచింది. ప్రతి భయాన్ని ఎదుర్కొన్నప్పుడు గెలిచింది. ప్రతి అవమానాన్ని అధిగమించినప్పుడు గెలిచింది. ప్రతి ఓటమి తర్వాత మళ్లీ బరిలోకి దిగినప్పుడు గెలిచింది. వెనక్కి వెళ్లడానికి ఎన్నో కారణాలు ఉన్నా... ముందుకు వెళ్లడానికి ఒక్క కారణాన్నే పట్టుకుని నడిచిన ప్రతిసారీ గెలిచింది. చివరకు ఆమె చేతిలో మెరిసింది ఒక పతకం. కానీ ఆమె జీవితమే ఒక సందేశంగా మారింది. మన కథ ఎక్కడ మొదలైందన్నది మన చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ మన కథ ఎక్కడికి చేరుకోవాలన్నది మాత్రం మన చేతుల్లోనే ఉంటుంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# నిధుల సమీకరణపై పార్టీల్లో హడల్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉపఎన్నికల పేరెత్తితేనే ప్రధాన పార్టీలు జంకుతున్నాయి. ప్రత్యర్థి పార్టీని చిత్తు చేసేందుకు వ్యూహాప్రతివ్యూహాలు రచించాలి. మిగతా పనులను పక్కన పెట్టి పోలింగ్, గెలుపు కోసం అహర్నిశలు కష్టపడాలి. వీటికి తోడు అదనంగా ప్రచారం, ఎలక్షన్ కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయాలి. అయినా ఫలితం తమకు అనుకూలంగా ఉంటుందో లేదోననే భయం మాత్రం అన్ని పార్టీలను వెంటాడం సహజం. కానీ పార్టీల ఆలోచనకు భిన్నంగా ఉపఎన్నికలు జరిగే నియోజకవర్గంలోని క్షేత్రస్థాయి లీడర్లు, కేడరులో మాత్రం ఉత్సాహం మొదలైంది. ఇంతకాలం పట్టించుకోని పార్టీ ఇప్పుడు తమకు ప్రయారిటీ ఇస్తుందని, అడిగిందల్లా సమకూర్చుతుందని హ్యాపీ మూడ్‌తో నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు.

**అన్ వాంటెడ్ బై పోల్..**

ఉపఎన్నిక వస్తే రూలింగ్ పార్టీని ఓడించి, తమ సత్తా చూపేందుకు విపక్షాలు రెడీగా కాచుకుని ఉంటాయి. అలాగే బై ఎలక్షన్‌లో గెలిచి చూపించి ప్రజలు తమవైపే ఉన్నారని సంకేతాలు ఇచ్చేందుకు అధికార పార్టీ సైతం ప్రయత్నిస్తుంటుంది. కానీ త్వరలో జరిగే ఖైరతాబాద్ ఉప ఎన్నికల విషయంలో మాత్రం అన్ని పార్టీలు ఈ బై పోల్ అనవసరమనే అభిప్రాయంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. మరో రెండేళ్లలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పుడు ఖైరతాబాద్ ఉపఎన్నికల రావడం వల్ల అనవసరపు ఖర్చు తప్పా, రాజకీయంగా వచ్చే ప్రయోజనం పెద్దగా ఉండదనే చర్చ లీడర్ల మధ్య జరుగుతున్నది.బై ఎలక్షన్ అంటేనే రూలింగ్ పార్టీకి అనుకూల పరిస్థితులు ఉంటాయి. గెలుపు కోసం అన్ని రకాల వ్యవస్థలను ఉపయోగించుకోవడం సహజం. కానీ ఇంతకాలం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిన నియోజకవర్గం లీడర్లు, కేడర్‌ను ఇప్పుడు మచ్చిక చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని అధికార పార్టీ లీడర్లు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. అలాగే విపక్ష లీడర్లలో సైతం అదే తరహా ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది.

**ఇజ్జత్ కా సవాల్..**

రూలింగ్ పార్టీ విజయం సాధించకపోతే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని ప్రచారం ఊపందుకుంటుంది. ఆ ప్రభావం తర్వాత జరిగే గ్రాడ్యుయేట్, కోర్ ఏరియాలోని మున్సిపల్ ఎన్నికలు, అనంతరం జరిగే అసెంబ్లీ ఎన్నికలపై పడే ప్రమాదం ఉంటుంది. అందుకని గెలుపు కోసం కాంగ్రెస్ మిగతా పనులను పక్కనబెట్టి, ఉప ఎన్నికలపై మాత్రమే ఫోకస్ పెట్టాల్సి ఉంటుంది. రూలింగ్ పార్టీతో సమానంగా విపక్షాలు సైతం ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాల్సిన పరిస్థితి. కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయం అని చెప్పుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ సైతం గెలుపు కోసం తీవ్రంగా కష్టపడాలి. లేకపోతే ఆ ప్రభావం రానున్న రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో గ్రాఫ్ పడిపోయే ప్రమాదం ఉంటుంది.

**పెద్ద ఎత్తున ప్రచారం, నిధుల సమీకరణ..**

సాధారణ ఎన్నికలతో పోల్చితే ఉప ఎన్నికల్లో ఖర్చు ఐదారు రేట్లు అధికంగా పెట్టాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లీడర్లను ఖైరతాబాద్ నియోజకవర్గానికి తరలించాలి. వారికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలి. ప్రత్యర్థి పార్టీలతో పోటీ పడి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలి. జాతీయ స్థాయి నాయకులను ప్రచారానికి రప్పించాలి. ఇదంతా ఒక ఎత్తయితే పోల్ మేనేజ్మెంట్ పెద్ద సవాల్. ప్రతి ఓటరునూ నేరుగా కలవాలి. వారిని మచ్చిక చేసుకునేందుకు దావత్‌లు ఇవ్వాలి. గిఫ్ట్లు పంపాలి. అదనంగా ఓటుకు ఎంతో కొంత ముట్టచెప్పాలి. గత ఏడాది జరిగిన జూబ్లీహిల్స్ బై ఎలక్షన్‌లో ఒక్కో ఓటరుకు తక్కువలో తక్కువ రూ.3 వేలు ఇవ్వగా, కొన్ని ఏరియాల్లో రూ.5 వేల వరకు పంచిపెట్టినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. ఇప్పుడు ఖైరతాబాద్‌లో అంతకంటే ఒకట్రెండు వేలు అదనంగా ఇవ్వాల్సి ఉంటుందనే చర్చ క్షేత్రస్థాయి లీడర్ల మధ్య జరుగుతున్నది.

**లీడర్లు, కేడర్‌కు పండుగే**

షెడ్యూల్ వచ్చిన రోజు నుంచి ఫలితాలు వెలువడే వరకు ప్రధాన పార్టీల్లో ఆందోళన ఉంటే, ఆయా పార్టీలకు చెందిన క్షేత్ర స్థాయి లీడర్లు, కేడర్‌లో మాత్రం పండుగ వాతావరణం ఉంటుంది. ఇంతకాలం పట్టించుకోని పార్టీలు ఉప ఎన్నిక రావడంతో ఎక్కడా లేని ప్రాధాన్యత తమకు ఇస్తారంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ ముగిసే వరకు తమకు ఏ లోటు రాకుండా చూసుకోవడంతో పాటు తాము అడిగిందల్లా వెంటనే సమకూర్చుతారని సంబుర పడుతున్నారు. ఎందుకంటే ఇంటింటికీ వెళ్లి ఓటరును కలవడం, వారిని తమ పార్టీ వైపునకు తిప్పుకునే పనిని పెద్ద స్థాయి లీడర్లు చేయలేరు.ఆ పనులను కేవలం నియోజకవర్గానికి చెందిన లీడర్లు, కేడర్ మాత్రమే చేస్తారు. అందుకని పోలింగ్ ముగిసే వరకు అన్ని పార్టీల్లోని లీడర్లు, కేడర్‌కు ఎక్కడా లేని ప్రాధాన్యత ఉంటుంది. వారు సూచించినట్టుగానే నడుచుకోక తప్పదు. లేకపోతే చేతులెత్తేసే ప్రమాదం ఉంది. అందకని పోలింగ్ ముగిసే వరకు వారికి ఏ లోటు రాకుండా అన్ని సమకూర్చాలి. ఇంటి ఖర్చులు, సొంత ఖర్చులకు నిధులు ఇవ్వాలి. దీంతో ఖైరతాబాద్ బై ఎలక్షన్ కోసం ఆ నియోజకవర్గంలోని లీడర్లు, కేడర్ ఆశగా ఎదురుచూస్తున్నారు.



## పోలీస్ కానిస్టేబుల్‌పై కత్తితో దాడి..!

**వికారాబాద్,ఫ్లాష్ ఇండియా :** వికారాబాద్ జిల్లా పరిగిలోని గణేష్ నిమజ్జన ఊరేగింపులో తీవ్ర కలకలం రేగింది. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న ఒక పోలీస్ కానిస్టేబుల్‌పై తరుణ్ అనే యువకుడు కత్తితో దాడికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. పరిగిలోని అయోధ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం కోసం నిర్వాహకులు ఊరేగింపుగా తీసుకుని వెళ్తున్నారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న తరుణ్ అనే యువకుడిని "తమ గణేష్ విగ్రహం దగ్గరకు రావద్దు" అని నిర్వాహకులు హెచ్చరించి అక్కడి నుంచి పంపించివేశారు.తననే రావద్దంటారా అని తీవ్ర ఆగ్రహానికి గురైన తరుణ్, మద్యం మత్తులో విగ్రహాన్ని తరలిస్తున్న ట్రాక్టర్ తాళం చెవిని లాక్కున్నాడు. దీంతో ట్రాక్టర్ తాళం లాక్కోవడంపై గణేష్ ఉత్సవ నిర్వాహక యువకులకు, తరుణ్‌కు మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఈ గొడవలో తరుణ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో యువకులపై దాడి చేయడానికి ప్రయత్నించాడు. అది గమనించి గొడవను సర్దుమణిగించేందుకు అడ్డువెళ్లిన కానిస్టేబుల్ నరసింహులుపై కత్తితో దాడి చేశాడు. కానిస్టేబుల్‌కు ఎడమ వైపు కడుపు భాగంలో తీవ్ర గాయమైంది. వెంటనే పోలీసులు గొడవ పడుతున్న యువకులను చెదరగొట్టి, కత్తి గాయమైన కానిస్టేబుల్ నరసింహులును పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో పరిగిలోని వివేకానంద విగ్రహం వద్ద చోటుచేసుకుంది. దాడికి పాల్పడ్డ నిందితుడు తరుణ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, అతడి వద్ద నుంచి కత్తిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

# ఆర్టీసీలో ఎన్నికల కోలాహలం..

**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)లో కార్మిక సంఘాల ఎన్నికల కోలాహలం మొదలైంది. కార్మిక సంఘాల ఎన్నికల్లో గెలిచేందుకు కార్మిక సంఘాల నాయకులు ఇప్పటికే ప్రచారం హోరెత్తిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2016లో గుర్తింపు సంఘాలు ఎన్నికలు జరిగాయి. తర్వాత సమీకరణాలు మారడంతో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తింపు సంఘాలను రద్దుచేసి ఆర్టీసీ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించింది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో ఆర్టీసీలో కార్మికుల గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరటంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో మళ్లీ గుర్తింపు సంఘాల ఎన్నికల హడావుడి మొదలైంది.

**లిఖితపూర్వక ఫిర్యాదు**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు డిపోల పరిధిలో ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు. డ్రైవర్లు , కండక్టర్లు, మెకానికులు, తదితర సిబ్బంది ఈ గుర్తింపు సంఘాల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, సత్తుపల్లి, మధిర, ఖమ్మం డిపోలో పరిధిలోని 1804 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. గుర్తింపు సంఘాల నాయకులు వారి వారి డిపోలలలో ప్రచారం నిర్వహించుకుంటూ విధులు కొనసాగిస్తున్నారు. ఏడు డిపోల పరిధిలో గుర్తింపు సంఘాల నాయకుల నాయకత్వంలో ఓట్లను ప్రభావితం చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలను రూపొందించుకున్నారు.

**బరిలో 6 గుర్తింపు సంఘాలు..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో ఉన్న గుర్తింపు సంఘాలు ఇప్పటికే ప్రచారం నిర్వహిస్తున్నాయి. సీపీఎం అనుబంధం ఎస్‌డబ్ల్యూఎఫ్, సీపీఐ అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్, కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ టీఎంయూ, నేషనల్ మజ్దూర్ యూనియన్, తెలంగాణ వర్కర్ యూనియన్ టీడబ్ల్యూ సంఘాలు ఎన్నికల బరిలో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎంప్లాయిస్ యూనియన్ హవా కొనసాగించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత టీఎంయూ గుర్తింపు సంఘం క్రైస్తవం చేసుకుంది. ప్రస్తుతం జరుగుతున్న గుర్తింపు సంఘాల ఎన్నికల్లో ఏ సంఘం కైవసం చేసుకుంటుందో ఉద్యోగుల ఓటర్లపై ఆధారపడి ఉంది.

**అక్టోబర్ 9న పోలింగ్**

ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు అక్టోబర్ 9వ తేదీన నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికలు కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కార్మిక శాఖ అధికారులు ఎన్నికల అధికారులుగా ఉంటారు. అక్టోబర్ 9వ తేదీన ఉదయం 6 గంటలకు ఎన్నికల పోలింగ్ కొనసాగుతుంది మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఎన్నికలు జరుగుతాయి. మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ మొదలు పెడతారు. కౌంటింగ్ లో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే ఆ సంఘానికి గుర్తింపుగా కేటాయిస్తారు.

**హోరాహోరీగా ప్రచారం..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు డిపోల పరిధిలో గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఇప్పటికే గుర్తింపు సంఘాల నాయకులు తమ గుర్తింపు సంఘం గెలుపు కోసం ప్రచారం ముమ్మరం చేశారు. గతంలో సంఘం చేసిన సేవలు, విజయాలు పై దృష్టి పెడుతున్నారు. సంఘాలు చేసిన విజయాలపై కార్మికులను చూపించి ఓట్లు వేయించుకునే విధంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

# కొనసాగుతున్న నిమజ్జనాలు...







**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌కు నలువైపుల నుంచి పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలు చేరుకుంటున్నాయి. ప్రస్తుతం గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా కొనసాగుతోంది. వేలాది మంది భక్తులు తరలిరావడంతో నిమజ్జన ప్రక్రియకు స్వల్ప ఆలస్యం జరుగుతుండగా, శోభాయాత్ర మధ్యాహ్నం వరకు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రక్రియను వీలైనంత త్వరితగతిన పూర్తి చేసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే.. నిమజ్జనం నేపథ్యంలో శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలను నేడు కూడా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్, పీవీ స్టాచ్యూ, ఇందిరాగాంధీ రోటరీ పరిసరాల్లో విగ్రహాల రద్దీ కారణంగా సాధారణ వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర నిన్నటి నుంచి ఎంతో ప్రశాంత వాతావరణంలో, వైభవంగా కొనసాగుతోందని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరిస్తున్న ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్, లిబర్టీ, మోజంజాహీ మార్కెట్ తదితర ప్రాంతాలకు కుటుంబ సమేతంగా లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో వాహనాల రాకపోకలు మందగించి, నిమజ్జన ప్రక్రియ కాస్త ఆలస్యమైందని పేర్కొన్నారు. ఈ శోభాయాత్ర నేటి మధ్యాహ్నం వరకు కూడా కొనసాగే అవకాశం ఉన్నందున, విగ్రహాల నిమజ్జనాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి పోలీస్, ట్రాఫిక్ విభాగాల సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలను నేడు కూడా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్, పీవీ స్టాచ్యూ, ఇందిరాగాంధీ రోటరీ పరిసరాల్లో విగ్రహాల రద్దీ కారణంగా సాధారణ వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అత్యవసరమైతే తప్ప సాధారణ వాహనదారులు ఈ మార్గాల్లో రాకపోకలను పూర్తిగా నివారించి, ప్రయాణాలను వాయిదా వేసుకోవడమో లేదా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడమో చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనవసరంగా రహదారులపైకి వచ్చి ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడవద్దని సూచించారు. ట్రాఫిక్ విభాగం ఎప్పటికప్పుడు జారీ చేసే అధికారిక సూచనలు, అడ్వైజరీలను గమనిస్తూ నగర ప్రజలంతా పోలీసు యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.ఇక, ఇప్పటికే హుస్సేన్ సాగర్‌లో వేలాది వినాయక విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యాయి. ప్రతి విగ్రహంతో పాటు పదుల సంఖ్యలో భక్తులు, మండపాల నిర్వాహకులు ఊరేగింపుగా తరలివస్తున్నారు. విగ్రహాలు మోసుకొచ్చే ప్రతి వాహనం నుంచి బ్లోయర్స్ ద్వారా రంగు రంగుల పేపర్లను గాల్లోకి ఎగరవేస్తుండటంతో.. ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్ రోడ్లపై కొన్ని టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోయింది. రోడ్లపై విపరీతంగా పేరుకుపోయిన చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను జిహెచ్ఎంసి కార్మికులు ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నారు. గత 13 రోజులుగా నిమజ్జన సమయంలో ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ రోడ్లపై పడుతున్న వ్యర్థాలను జిహెచ్ఎంసి సిబ్బంది నిరంతరం శుభ్రం చేస్తూ పరిశుభ్రతను కాపాడుతున్నారు.





## చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు

**వికారాబాద్ జిల్లా/చౌడాపూర్,మండల, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

మల్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ వీరనారి, పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.గ్రామ సర్పంచ్ చాకలి లావణ్య రామాంజనేయులు, మరియు తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ గోపాల్ గారి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్. గోపాల్ మాట్లాడుతూ – భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం నిజాం నిరంకుశ పాలనపై పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని, ఆమె స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొని ఐలమ్మ జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

# సోషల్ మీడియాలో డబ్బూ, నగలు ప్రదర్శన..

**కన్యాకుమారి :** సోషల్ మీడియాలో ఫాలోవర్ల కోసం తమ సంపదను ప్రదర్శించడం ఎంత ప్రమాదకరమో తెలిపే ఘటన ఇది. యూట్యూబ్‌లో తరచూ డబ్బు, బంగారాన్ని చూపిస్తూ రీల్స్ చేసే ప్రముఖ మహిళా యూట్యూబర్ ఇంట్లోనే భారీ చోరీ జరిగింది. కన్యాకుమారి జిల్లాలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్యాకుమారి జిల్లా నాగర్‌కోవిల్ సమీపంలోని తమ్మట్టుకోణం 'విఐపి గార్డెన్' ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త, యూట్యూబర్ వినోద్ కుమార్, మధుమిత దంపతులు నివసిస్తున్నారు. భర్తతో కలిసి యూట్యూబ్ వీడియోలు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేసే మధుమిత.. తరచూ తన పూజా గదిలోనూ, మంచం మీద నగలు, కట్టలు కట్టలుగా ఉన్న డబ్బును ప్రదర్శిస్తూ వీడియోలు పోస్ట్ చేస్తుండేది.తమ ఇంట్లో ఉన్న సంపదను సోషల్ మీడియాలో ఇలా బహిరంగంగా చూపించడంతో దొంగల కన్ను వీరి ఇండిపై పడింది. ఈ నేపథ్యంలోనే కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన సమయం చూసి దుండగులు ప్లాన్ ప్రకారం రంగంలోకి దిగారు. గుట్టుచప్పుడు కాకుండా ఆ ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు.. వెనుక వైపు తలుపులు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాల్లో దాచిన సుమారు 118 సవర్ల (సుమారు 1 కిలో పైచిలుకు) బంగారం, వజ్రాభరణాలతో పాటు భారీగా నగదును దోచుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ. 1 కోటి వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.షాపింగ్ ముగించుకుని తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి వెనుక తలుపులు తెరుచుకుని ఉండటం, అల్మారాలు పగలగొట్టి ఉండటంతో షాక్‌కు గురైన యజమానులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై రాజక్కమంగళం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోల ఆధారంగానే ఈ దొంగతనం జరిగి ఉంటుందని పోలీసులు తెలిపారు. దొంగతనం జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్, ఫోన్ కాల్ డేటాను పరిశీలిస్తూ పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన మంత్రి జూపల్లి



**చిన్నంబావి,ఫ్లాష్ ఇండియా :** చిన్నంబావి మండలం గడ్డ బస్వాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి చిదంబర్ రెడ్డి తల్లి, మాజీ సర్పంచ్ మందడి లలితమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు.వారి నివాసానికి వెళ్లిన మంత్రి జూపల్లి, లలితమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు మందడి చిదంబర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మందడి సత్యరాణిలకు ధైర్యం చెప్పారు. ఈ పరామర్శలో కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకులు కొత్త కళ్యాణ్ రావు, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మండల సీనియర్ నాయకులు బీచుపల్లి యాదవ్, కొప్పునూర్ గ్రామ సర్పంచ్ బిచ్చన్న, గడ్డ బస్వాపూర్ గ్రామ సర్పంచ్ మల్లకల్, పార్టీ ముఖ్య నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మార్టేరులో అద్భుత దృశ్యం





**పశ్చిమ గోదావరి జిల్లా,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
పశ్చిమ గోదావరి జిల్లాలోని మార్టేరు శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో సుప్రభాత సేవ సమయంలో ఆకాశంలో స్వామివారి ఆకృతి కనిపించడం భక్తులను ఆకట్టుకుంది.సుప్రభాత సేవ సమయంలో ఆకాశంలో కనిపించిన ఈ దృశ్యాన్ని భక్తులు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.వేలగల చైతన్య ప్రసాద్ రెడ్డి చైర్మన్

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి.. పాల్గొన్న రజక పెద్దలు




**నాగర్ కర్నూల్ జిల్లా/ అమ్రాబాద్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
ఈ రోజు మన ఊరిలో విరానారి చిట్యాల ఐలమ్మ గారి జయంతి వేడుకలు ప్రాథమిక ఉన్నంత పాఠశాల అమ్రాబాద్ లో ఘనంగా మన రజక మిత్రులు పెద్దలు అందరు కలిసి ఘనంగా నిర్వహించారు చిట్యాల ఐలమ్మ గారు రజాకారుల పెత్తందారుల మీద పోరాటం గురించి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు మన రజక సోదరులు పెద్దలు ఈ ఉత్సవం ఘనంగా నిర్వహించారు అందుకు వీరందరికీ ప్రత్యేక ధన్యవాదాలు ఇలాగే ప్రతి సంవత్సరం కూడా ఐలమ్మ గారి జయంతి మరియు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించగలరు.

# జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం



**అడ్డగూడూరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
మండల పరిధిలోని రేపాక-డి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలకు న్యాయ హక్కులు, ఉచిత న్యాయ సహాయం, బాలల హక్కులు, బాలల రక్షణ, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దంతూరి సతయ్య, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులకు న్యాయపరమైన హక్కులు, చట్టాల ప్రాధాన్యత, ప్రతి ఒక్కరూ తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే అవసరమైన సందర్భాల్లో అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుక్క శ్రవణ్, ఏజీపీ, కునూరు శ్రీనివాస్, ప్యానెల్ అడ్వకేట్, జి. శ్రీనివాస్, న్యాయవాది, కనుగంటి శ్రీశైలం, అగ్రిలీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యులు, కె. యాదయ్య, పారా లీగల్ వాలంటీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల హక్కులు, బాలల రక్షణ, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఏవైనా చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను, న్యాయ సేవా సంస్థలను సంప్రదించే విధానాలను వివరించారు. ఈ న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో న్యాయపరమైన అవగాహనను పెంపొందించడంతో పాటు, తమ హక్కులు, బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు కృషి చేయడం జరిగింది. సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండేలా న్యాయ సేవలపై అవగాహన కల్పించడం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యంగా నిలిచింది.

# చిరుత సంచారం.. గ్రామాల్లో భయాందోళన




**దౌల్తాబాద్,ఫ్లాష్ ఇండియా :** దౌల్తాబాద్ మండలంలోని గొడుగుపల్లి అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు కనిపించడంతో గొడుగుపల్లి, మహ్మద్‌షాపూర్, కోనాపూర్, తిర్మలాపూర్ గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం మహ్మద్‌షాపూర్ గ్రామ సమీపంలో చిరుతపులి పాదముద్రలను గ్రామస్థులు గుర్తించారు. దీంతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కరీముద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని పాదముద్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ ఆఫీసర్ కరీముద్దీన్ మాట్లాడుతూ..చిరుత సంచారంపై గ్రామస్థులను అప్రమత్తం చేశారు. అటవీ ప్రాంతం వైపు ఒంటరిగా వెళ్లవద్దని, రాత్రివేళల్లో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పశువులను అటవీ ప్రాంతం వైపు మేతకు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. చిరుత పులి ఒకే ప్రాంతంలో ఉండదని, చిరుత కనిపించినా దాని వెంటపడకుండా వెంటనే అటవీశాఖకు సమాచారం అందించాలని సూచించారు.



# రంగంపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతులు..

**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** 33/11 కేవీ రంగంపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఆదివారం (సెప్టెంబర్ 27) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు పెద్దబొంకూర్, పెద్దకల్వల, నిట్టూర్, పెద్దపల్లి, రంగంపల్లి, నిమ్మనపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు అంతరాయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని అదనపు సహాయ ఇంజనీర్ (ఆపరేషన్), పెద్దపల్లి పట్టణం సీహెచ్. శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు.

# మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
భారత విద్యార్థి ఫెడరేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న నాయక్ మాట్లాడుతూ 80 ఏళ్ల స్వాతంత్రం భారతదేశంలో రోజురోజుకూ మహిళలకు రక్షణ కరువవుతోందని అన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్న పరిస్థితి దేశంలో కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. దేశంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట మహిళలు,బాలికలపై దాడులు జరుగుతున్నాయని, ఇటువంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు మరింత కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దత్తు,నాగరాజు,నవీన్ జనని,త్రివేణి,లక్ష్మి,గీత,సుప్రజ,విజనిరమల,జ్యోతి,నాగలక్ష్మి ,ఉషారాణి, సానియా వెన్నెల,షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి టూరిజం అవార్డుల్లో నాగార్జున ప్రభుత్వ కళాశాల సత్తా...

మూడు విభాగాల్లో అవార్డులు కైవసం
విద్యార్థుల ప్రతిభకు రాష్ట్రస్థాయి గుర్తింపు
శిల్పారామంలో మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అవార్డుల ప్రదానం
విజేతలను అభినందించిన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సముద్రాల ఉపేందర్






**నల్గొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాష్ట్రస్థాయి టూరిజం పోటీల్లో నాగార్జున ప్రభుత్వ కళాశాల (అటానమస్), నల్గొండ విద్యార్థులు తమ సృజనాత్మక ప్రతిభను చాటుకున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టూరిజం పోటీల్లో మూడు విభాగాల్లో అవార్డులు సాధించి కళాశాలకు ఘనత తీసుకువచ్చారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యాటక రంగంపై అవగాహన, తెలంగాణ చారిత్రక--సాంస్కృతిక వారసత్వం, స్థానిక పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యత, సృజనాత్మకత, సామాజిక భాగస్వామ్యం వంటి అంశాలను ప్రోత్సహించే విధంగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో మెుత్తం ఐదు కేటగిరీల్లో పోటీలు నిర్వహించగా, నాగార్జున ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మూడు విభాగాల్లో అవార్డులు సాధించడం విశేషం.

**అవార్డులు సాధించిన విద్యార్థులు..**
షార్ట్ ఫిల్మ్ / సోషల్ మీడియా క్యాంపెయిన్ విభాగం పి. నిశ్చల-II B.A. పర్యాటక రంగానికి సంబంధించిన అంశాలను సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా రూపొందించిన ప్రదర్శనకు అవార్డు సాధించారు. ఆర్ట్స్ ఉ క్రాఫ్ట్స్ విభాగం జి. జ్యోత్స్న - III B.Sc. (BTBC) కళాత్మక ప్రతిభను ప్రదర్శిస్తూ పర్యాటక, సాంస్కృతిక అంశాలను ప్రతిబింబించే సృజనాత్మక ప్రదర్శనతో రాష్ట్రస్థాయి అవార్డు సాధించారు. కమ్యూనిటీ యాక్టివిటీ విభాగం బి. నాగార్జున, జి. మణి చరణ్, ఐ. రాఘవేంద్ర, ఉదయ్, బి. శంకర్ సమాజ భాగస్వామ్యంతో పర్యాటక ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాల ద్వారా ఈ బృందం రాష్ట్రస్థాయి అవార్డును సాధించింది. మంత్రి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం... హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలైన నాగార్జున ప్రభుత్వ కళాశాల విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డులను అందుకున్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ అభినందనలు... ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ, విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి మూడు విభాగాల్లో అవార్డులు సాధించడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు, తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక వారసత్వంపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. అవార్డులు సాధించిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశనం చేసిన జిల్లా యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్యను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు కళాశాల ఎల్లప్పుడూ సహకరిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి వేదికపై మూడు విభాగాల్లో అవార్డులు సాధించడం ద్వారా నాగార్జున ప్రభుత్వ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను మరోసారి చాటిచెప్పారని కళాశాల అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. విజేతలకు కళాశాల కుటుంబం అభినందనలు తెలిపారు.

# చౌడాపూర్ మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం ఐలమ్మ 131వ జయంతి వేడుకలు



**వికారాబాద్ జిల్లా/ చౌడాపూర్,మండల, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
చౌడాపూర్ కేంద్రంలోనీ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీరవనిత చాకలి ఐలమ్మ 131.వ జయంతినీ ఆమె చిత్ర పటానికి పూలమాలవేసి జయంతి సందర్భంగా చౌడాపూర్ మండల తహసిల్దార్ వెంకటేశ్వర్లు పూలమాల వేసి ఘనంగా నివాళిలు అర్పించారు. మాలమహానాడు వికారాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి.వెంకటేష్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ చరిత్రలో సామాజిక న్యాయం భూమి కోసం ఆత్మగౌరవం హక్కుల సాధన కోసం ధైర్యంగా పోరాడిన వీరవణితగా చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు నిబద్ధత పోరాట పటిమ నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. మండల తహసిల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతు. సామాజిక అసమానతలు దోపిడీ అన్యాయాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం ప్రజాస్వామ్య విలువలను సమానత్వ భావనను మరింత బలోపేతం చేసేలా ఉందని చౌడాపూర్ మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు.. బిసి సంఘాల నాయకులు బోయిని బాల్ రాజ్ మాట్లాడుతు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు హక్కులు గౌరవం కల్పించడమే చాకలి ఐలమ్మ ఆశయాలకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సమానత్వం మహిళా సాధికారత అణగారిన వర్గాల అభ్యున్నతి సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అన్నారు. రజక సంఘం చౌడాపూర్ మండల అధ్యక్షులు చాకలి యాదయ్య మాట్లాడుతు. సమాజంలో బడుగు బలహీన వర్గాల సిద్ధాంతాల కోసం పీడిత వర్గాల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శం ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మహనీయులు కలలుగన్న ఆశల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు చాకలి ఐలమ్మ సేవలు పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడంతో పాటు ఆమె ఆశయాల సాధన దిశగా సమాజం ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు,మాలమహానాడు వికారాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి వెంకటేష్,రజక సంఘం చౌడపూర్ మండల అధ్యక్షులు చాకలి యాదయ్య, ఆర్ఐ రవినాయక్,బి.సి సంఘాల నాయకులు బోయిని బాలు రాజ్, లంబాడ హక్కుల ఐక్యవేదిక నాయకులు రమేష్ నాయక్, కొత్తపల్లి తండ ఉపసర్పంచ్ రవి నాయక్,కావలి నవీన్,చంద్రమోని గోపాల్,పాల చంద్రయ్య,కావాలి రాజు,పరిగి శ్రీకాంత్,దాస్యనాయక్ తండ సర్పంచ్ లవుడ్య శ్రీనువాస్,రెవిన్యూ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణ వీరనారి, ధీర మహిళ చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని ఐలమ్మ గారి విగ్రహానికి రజక సంఘం నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ,వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ గారు చూపిన ధైర్యం, ఆత్మగౌరవం,పోరాట స్ఫూర్తి సమాజానికి ఎప్పటికీ ఆదర్శమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో సమానత్వం,సామాజిక న్యాయం,ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బిఎల్ఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

# వ్యక్తి అదృశ్యం..



**శంషాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాలమాకుల గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ (56) ఎలక్ట్రీషియన్ గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24న మధ్యాహ్నం భోజనం అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనోజ్ రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అదే రోజు రాత్రి పాలమాకులలోని వైన్స్ వద్ద మనోజ్ మద్యం సేవించి ఉన్నట్లు అతనితో కలిసి పనిచేసే నరేష్ కుటుంబ సభ్యులకు తెలిపాడు. మనోజ్‌ను ఇంటి వద్ద వదిలేస్తామని చెప్పినా, తానే వెళ్తానని చెప్పాడు. కుటుంబ సభ్యులు మనోజ్ కోసం గాలించిన ఫలితం లేకపోవడంతో శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

# భారత మహిళల కబడ్డీ జట్టు విజయం..



ఆసియా క్రీడలు 2026లో భారత మహిళల కబడ్డీ జట్టు స్వర్ణ పతకం సాధించింది. శనివారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో భారత్ ఇరాన్‌ను 37-34 తేడాతో ఓడించి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. మ్యాచ్ చివరి వరకు ఉత్కంఠగా సాగినప్పటికీ.. కీలక సమయంలో భారత జట్టు ఆధిపత్యం ప్రదర్శించి విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ విజయంతో ఆసియా క్రీడల మహిళల కబడ్డీలో భారత్ నాలుగో స్వర్ణ పతకాన్ని సాధించింది. 2010, 2014, 2022 ఆసియా క్రీడల్లోనూ భారత మహిళల జట్టు స్వర్ణం గెలిచింది. 2018లో మాత్రం రజత పతకంతో సరిపెట్టుకుంది. 2022లో చైనీస్ తైపీని 26-25తో ఓడించి టైటిల్ గెలిచిన భారత్.. ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకుంది.

**ఫైనల్లో ఏం జరిగింది?**

ఇరాన్‌తో జరిగిన ఫైనల్లో భారత జట్టు ఆరంభం నుంచే ఆధిక్యంలో నిలిచింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత్ 22-16తో ఆధిక్యంలో ఉంది. అయితే రెండో అర్ధభాగంలో ఇరాన్ గట్టిగా పోరాడింది. ఒక దశలో భారత్ ఆధిక్యాన్ని 26-27కు తగ్గించింది. దీంతో మ్యాచ్ చివరి నిమిషాల్లో ఉత్కంఠ నెలకొంది. కానీ భారత ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి మళ్లీ పుంజుకుని చివరకు 37-34తో విజయం సాధించారు.

**ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ ఆధిపత్యం**

ఆసియా క్రీడల్లో కబడ్డీకి భారత్ సుదీర్ఘ విజయ చరిత్ర ఉంది. 1990లో కబడ్డీని ఆసియా క్రీడల్లో చేర్చినప్పటి నుంచి భారత్ పురుషుల, మహిళల విభాగాల్లో అనేక స్వర్ణ పతకాలు సాధించింది. 2026 క్రీడలకు ముందు మహిళల విభాగంలో 2010, 2014, 2022లో భారత్ స్వర్ణం గెలుచుకుంది. ఈసారి కూడా మహిళల జట్టు టైటిల్‌ను నిలబెట్టుకోవడంతో భారత కబడ్డీ ఖాతాలో మరో స్వర్ణం చేరింది.

**ఈ ఆసియా క్రీడల్లో భారత్‌కు మూడో స్వర్ణం**

మహిళల కబడ్డీ స్వర్ణంతో 2026 ఆసియా క్రీడల్లో భారత్ స్వర్ణ పతకాల సంఖ్య మూడుకు చేరింది. అంతకుముందు భారత మహిళల క్రికెట్ జట్టు స్వర్ణం సాధించగా, షూటింగ్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ భారత్ బంగారు పతకం గెలుచుకుంది. మహిళల కబడ్డీ స్వర్ణం భారత బృందానికి మరో ముఖ్యమైన విజయంగా నిలిచింది.

# 44 ఏళ్ల తర్వాత రజతం గెలిచిన సావన్ బర్వాల్




ఆసియా క్రీడల చరిత్రలోనే భారత అథ్లెటిక్స్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ప్రతిష్ఠాత్మక పురుషుల మారథాన్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ సావన్ బర్వాల్ అద్భుత ప్రదర్శన కనబరిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ విభాగంలో ఏకంగా 44 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ భారత్‌కు పతకం సాధించిపెట్టిన ఘనతను ఆయన సొంతం చేసుకున్నారు. అత్యంత కఠినమైన 42.195 కిలోమీటర్ల సుదీర్ఘ పరుగును బర్వాల్ కేవలం 2 గంటల 11 నిమిషాల 37 సెకన్లలో (2:11:37) పూర్తి చేసి ముగింపు రేఖను దాటారు. ఈ మైలురాయి సమయం ఆయన కెరీర్‌లోనే 'పర్సనల్ బెస్ట్' రికార్డుగా నమోదు కావడం విశేషం. హోరాహోరీగా సాగిన ఈ రేసులో జపాన్ అథ్లెట్ ఇచితాకా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, బర్వాల్ తన అసాధారణ వేగం, పట్టుదలతో రజతాన్ని ముద్దాడారు. ఆసియా క్రీడల మారథాన్ విభాగంలో భారత్‌కు చివరగా 1982 ఢిల్లీ ఆసియాడ్ క్రీడల్లో హోసూర్ కుక్కప్ప సీతారామ్ కాంస్య పతకాన్ని సాధించిపెట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు నాలుగు దశాబ్దాలకు పైగా ఈ విభాగంలో భారత అథ్లెట్లకు పతకం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఆ లోటును భర్తీ చేస్తూ సావన్ బర్వాల్ చారిత్రాత్మక రజతాన్ని సాధించడంతో భారత అథ్లెటిక్స్ శిబిరంలో సంబరాలు మిన్నంటాయి. సుదీర్ఘ దూరపు పరుగులో భారత క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటగలరని బర్వాల్ తాజా విజయంతో నిరూపించారని ప్రశంసిస్తూ క్రీడా ప్రముఖులు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు.

# భారత కుర్రాళ్లదే విజయం



ఆస్ట్రేలియా-ఎతో తొలి అనధికారిక టెస్టులో భారత్-ఎ జట్టు 162 పరుగుల తేడాతో గెలిచింది. 363 పరుగుల లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 55/2తో చివరి రోజైన శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 200 పరుగులకు కుప్పకూలింది. భారత బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే (8-2-14-3)ప్రత్యర్థి పనిపట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 334, ఆసీస్ 171 రన్స్ చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 199 రన్స్ సాధించింది.

**చెస్‌లో భారత్‌కు విజయాలు**

సమర్‌ఖండ్ (ఉజ్బెకిస్థాన్): చెస్ ఒలింపియాడ్‌లో భారత ఓపెన్, మహిళల జట్లు తొమ్మిదో రౌండ్‌ను విజయంతో ముగించాయి. శుక్రవారం జరిగిన తొమ్మిదో రౌండ్‌లో భారత మహిళల జట్టు 3-1తో ఆతిథ్య ఉజ్బెకిస్థాన్‌పై ఘన విజయం సాధించింది. మొత్తం 11 రౌండ్ల ఈ పోటీల్లో మరో రెండు రౌండ్లు మిగిలున్నాయి.



# రీఎంట్రీకి మరో బ్రేక్..

టీమిండియా సీనియర్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు మరోసారి గాయం అయింది. అతడి కుడి కాలి కింది భాగంలో కొత్తగా గాయం గుర్తించారు. దీంతో కనీసం మూడు వారాల పాటు పోటీ క్రికెట్‌కు దూరంగా ఉండనున్నాడు. ఫలితంగా న్యూజిలాండ్‌తో జరిగే వైట్‌బాల్ సిరీస్‌కు కూడా హార్దిక్ అందుబాటులో ఉండే అవకాశం లేకుండా పోనుంది. హార్దిక్ పాండ్యా 'రిటర్న్ టు ప్లే' తేదీని సెప్టెంబర్ 20గా నిర్ణయించారు. దీంతో అక్టోబర్ 6 నుంచి ఆస్ట్రేలియా-ఎతో జరగనున్న వన్డే సిరీస్ కోసం భారత్-ఎ జట్టులో అతడిని సెలెక్టర్లు ఎంపిక చేశారు. అయితే తాజాగా నిర్వహించిన స్కాన్లలో కుడి కాలి కింది భాగంలో గాయం బయటపడింది. బీసీసీఐ వైద్య బృందం రెండు వారాల పాటు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించింది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు సంబంధించిన పరిణామాలను పరిశీలిస్తున్న ఓ అధికారి ఈ విషయాన్ని తాజాగా వెల్లడించారు. బీసీసీఐ మెడికల్ ప్యానెల్ అధిపతి డాక్టర్ దిన్షా పార్డీవాలా హార్దిక్ వైద్య నివేదికలను పరిశీలించినట్లు తెలిపారు. ఆయన జపాన్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత హార్దిక్‌ను పరీక్షించి, రిహాబిలిటేషన్ ఎప్పుడు ప్రారంభించాలనే విషయంపై నిర్ణయం తీసుకోనున్నారు. అక్టోబర్ 22 నుంచి న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఆ తర్వాత వన్డే సిరీస్ జరగనుంది. ప్రస్తుత గాయం కారణంగా అప్పటికి హార్దిక్ పాండ్యా తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ఆసియా గేమ్స్ కోసం భారత బృందంతో హార్దిక్‌ను జపాన్‌కు పంపించాలని బీసీసీఐ తొలుత భావించింది. ఇందుకోసం బీసీసీఐ ఆపరేషన్స్ బృందం అతడి పాస్‌పోర్ట్‌ను కూడా వీసా సంబంధిత పనుల కోసం తీసుకుంది. అయితే ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ ప్రారంభానికి ముందు ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా హార్దిక్ మోకాలి ప్రాంతంలో ఒక్కసారిగా తీవ్రమైన నొప్పిని ఎదుర్కొన్నాడు. దీంతో కొంతకాలం విశ్రాంతి తీసుకున్న హార్దిక్.. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందేందుకు సిద్ధమవుతున్న సమయంలో మరోసారి నొప్పి వచ్చింది. స్కాన్లు చేయించగా గాయం ఉన్నట్లు తేలింది. ఐపీఎల్ ముగిసినప్పటి నుంచి బెంగళూరులోనే ఉంటున్న హార్దిక్.. ప్రస్తుతం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో శిక్షణ పొందుతున్నాడు. అయితే గత నాలుగు నెలల్లోనే హార్దిక్‌కు పలుమార్లు గాయాలు ఇబ్బంది పెట్టాయి. ఆఫ్ఘనిస్థాన్ వన్డేలు, ఇంగ్లండ్ టీ20లు, ఇప్పుడు ఆస్ట్రేలియా-ఎ సిరీస్‌కు ముందు అతడు చిన్నచిన్న గాయాలకు గురయ్యాడు. దీంతో అతడి పునరాగమనానికి అవి అడ్డంకిగా మారుతున్నాయి. న్యూజిలాండ్ సిరీస్ కూడా మిస్ అయ్యే పరిస్థితులు ఉండడంతో.. ఫిట్‌గా ఉంటే జింబాబ్వే వన్డేలతో పునరాగమనం చేసే అవకాశం ఉంది. లేదంటే విజయ్ హజారే ట్రోఫీ లేదా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడటం ద్వారా తన ఫిట్‌నెస్‌ను పరీక్షించుకునే అవకాశం కలుగుతుంది.

# బిజినెస్

## మూడు రోజులు సమ్మె..




ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలని బ్యాంక్ ఉద్యోగులు సుదీర్ఘంగా వినిపిస్తున్న డిమాండ్‌పై ప్రభుత్వం జరిపిన చర్చల్లో పురోగతి లేకపోవడంతో, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బీయూ) సెప్టెంబర్ 28 నుండి 30 వరకు మూడ్రోజులు దేశవ్యాప్త బ్యాంకుల సమ్మెకు పిలుపునిచ్చింది. సమ్మె కారణంగా బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగనున్న నేపథ్యంలో.. ఖాతాదారులకు ఉపశమనం కలిగిస్తూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. సమ్మె సమయంలో వినియోగదారులు ఇతర బ్యాంకుల ఏటీఎమ్‌లలో నగదు ఉపసంహరించుకున్నా ఎలాంటి ఏటీఎమ్ లావాదేవీ రుసుములు వసూలు చేయబోమని ప్రకటించింది. కాకపోతే, ఆయా ప్రాంతాల్లోని ఏటీఎమ్‌లలో నగదు లభ్యతపై ఇది ఆధారపడి ఉంటుంది. ఖాతాదారులకు అత్యవసర బ్రాంచ్ పనులు ఉంటే పూర్తి చేసుకోవడానికి సెప్టెంబర్ 27వ తేదీని బ్యాంకింగ్ పనిదినంగా ప్రకటించారు. సెప్టెంబర్ 27 ఆదివారం అయినప్పటికీ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్ఆర్‌బీ) తప్పనిసరిగా పనిచేయాలని అధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పత్రాల సమర్పణ, బ్రాంచ్ స్థాయి అభ్యర్థనలు లేదా నేరుగా బ్యాంక్ అధికారుల సాయం అవసరమైన ఖాతాదారులు సమ్మె ప్రారంభం కాకముందే, అంటే సెప్టెంబర్ 27న తమ పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. సమ్మె సమయంలో నగదు కొరత లేదా బ్రాంచ్ సేవలు నిలిచిపోయినా దైనందిన లావాదేవీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు తెలిపారు. యూపీఐ ద్వారా మర్చంట్ చెల్లింపులు, మనీ ట్రాన్స్‌ఫర్‌లు యథావిధిగా చేసుకోవచ్చు. అలాగే మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఎన్ఈఎఫ్‌టీ , ఆర్‌టీజీఎస్ , ఐఎమ్‌పీఎస్ సేవలు అందుబాటులో ఉంటాయి. ఖాతాదారులు ముందుగానే తమ డిజిటల్ యాప్‌లు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో చూసుకోవాలని, బ్రాంచ్ పనులను సెప్టెంబర్ 27లోపే ముగించుకుని, అవసరమైన డిజిటల్ లావాదేవీలను వినియోగించుకోవాలని కోరారు.

# ఏథర్ నుంచి మరొక ఎలక్ట్రిక్ వెహికిల్ లాంచ్..



ప్రముఖ ఎలక్ట్రిక్ టూ-వీలర్ తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ న్యూఢిల్లీలో తన నూతన ఎలక్ట్రిక్ స్కూటర్ 'కొణార్క్'ను అధికారికంగా మార్కెట్లోకి విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ స్కూటర్లను మరింత మెయిన్‌స్ట్రీమ్‌లోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కొత్త వాహనాన్ని రూపొందించారు. ఈ ఈవీ రోజు వారీ ప్రయాణాలను మరింత సులభతరం చేయడానికి అద్భుతమైన రేంజ్, కంఫర్ట్ , ఈజీ మెయింటెనెన్స్‌ను అందిస్తుంది. ఢిల్లీలో దీని ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర రూ. 79,999గా నిర్ణయించారు. ఈ స్కూటర్ 'కొణార్క్ ఎస్', 'జెడ్' ప్రొడక్ట్ లైన్ల కింద మొత్తం 6 వేరియంట్లలో లభిస్తుంది. ఇది సింగిల్ చార్జ్‌పై గరిష్టంగా 200 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్‌ను ఇస్తుంది. అన్ని వేరియంట్లు ఏథర్ సంస్థకు చెందిన 6వ తరం 'బెడ్రాక్ బ్యాటరీ'ని కలిగి ఉన్నాయి. దీనిపై ఏకంగా 10 సంవత్సరాలు లేదా 1,00,000 కిలోమీటర్లు అంటే ఏది ముందైతే అది వారంటీని అందిస్తున్నారు. అంతేకాకుండా, ఈ వారంటీ కాలం ముగిసే సమయానికి కూడా కనీసం 70 శాతం బ్యాటరీ హెల్త్ తగ్గకుండా ఉండేలా గ్యారెంటీ ఇస్తున్నారు. రైడర్ల సౌకర్యం కోసం ఇందులో అనేక అధునాతన ఫీచర్లను పొందుపరిచారు. రోడ్డు పరిస్థితులకు తగినట్లుగా బ్రేకింగ్‌ను అడ్జస్ట్ చేసే అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రిక్ బ్రేకింగ్ సిస్టమ్ , కీ-లెస్ అనుభూతినిచ్చే మ్యాజిక్-కీ, ఆటోపప్ సీట్ ఓపెనింగ్, ఇరుకైన ప్రదేశాలలో పార్కింగ్ సులభం చేసే ఎయిర్‌వాక్ వంటి ఫీచర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అలాగే.. 14-అంగుళాల ఫ్రంట్ అల్లాయ్ వీల్, 12-అంగుళాల రియర్ వీల్, 1,352 మిమీ వీల్‌బేస్ , లాంగ్-ట్రావెల్ సస్పెన్షన్ భారతీయ రోడ్లకు అత్యంత అనుకూలంగా ఉంటాయి. ఇంటిగ్రేటెడ్ ఆన్‌బోర్డ్ ఛార్జర్‌తో వచ్చే ఈ స్కూటర్‌ను, ఆప్షనల్ 450W ఛార్జర్ సాయంతో మరింత వేగంగా ఛార్జ్ చేసుకోవచ్చు. దీని సర్వీస్ ఇంటర్వెల్ 10,000 కిలోమీటర్లు లేదా ఏడాదిగా ఉంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో వేగంగా పెరుగుతున్న ఈవీ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని, ఏథర్ సంస్థ ఇప్పటికే అక్కడ 11 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు, 7 సర్వీస్ సెంటర్లు, 273 ఫాస్ట్ ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి తన నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేసింది.

# గ్యాస్ సిలిండర్ ధరలు



ఈ నెల ఒకటో తేదీన హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు స్వల్పంగా పెరిగిన విషయం తెలిసిందే. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.11 పెరిగింది. ఈ ధరలు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,996గా ఉంది.

ఇదిలా ఉంటే..

గత నెల(ఆగస్టు)తో పోలిస్తే గృహ వినియోగ ఎల్‌పిజి ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు.

ప్రస్తుతం(సెప్టెంబర్ 26) రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**ఈ రోజు గ్యాస్ సిలిండర్ ధరలు**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50

# పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు




ఇవాళ(శనివారం) పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. హైదరాబాద్‌లో ప్రస్తుతం పెట్రోల్ ధర లీటరుకు రూ.116.15గా ఉంది. ఇదిలా ఉంటే.. గత ఆగస్టు నెలతో పోల్చితే కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ధరల్లో కూడా ఎలాంటి మార్పులు లేవు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ప్రస్తుతం కిలో సీఎన్‌జీ గ్యాస్ ధరలు హైదరాబాద్‌లో రూ.112.00, వరంగల్‌లో రూ.110.00, విశాఖపట్నంలో రూ.99.80, విజయవాడలో రూ.103.00గా ఉన్నాయి.

**సెప్టెంబర్ 26వ తేదీ నాటి పెట్రోల్ డీజిల్ ధరలు..**

హైదరాబాద్
లీటర్ పెట్రోల్ ధర: రూ.116.15
లీటర్ డీజిల్ ధర రూ.104.23
వరంగల్
లీటర్ పెట్రోల్ ధర: రూ.115.62
లీటర్ డీజిల్ ధర రూ.103.74
విశాఖపట్నం
లీటర్ పెట్రోల్ ధర: రూ.116.39
లీటర్ డీజిల్ ధర రూ.104.11
విజయవాడ
లీటర్ పెట్రోల్ ధర: రూ.117.25
లీటర్ డీజిల్ ధర రూ.104.96




# 'రామాయణ' నుంచి 'జై జై రామ్' రిలీజ్

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ'. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన దక్కించుకోగా.. తాజాగా ఫస్ట్ సింగిల్ 'జై జై రామ్' ను తెలుగులో రిలీజ్ చేశారు మేకర్స్. దైవం, సంగీతం, సినిమాటిక్ గ్రాండియర్.. ఈ మూడు కలిసినప్పుడు ఆ అనుభూతి ఎలా ఉంటుందో చూపిస్తూ వచ్చిన ఈ తొలి సింగిల్ 'Jai Jai Ram' ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతూ విశేష స్పందన దక్కించుకుంటుంది. కాగా.. నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ విజువల్ వండర్‌ను అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇందులో రాముడి పాత్రలో రణబీర్ కపూర్, సాయి పల్లవి సీతాదేవిగా, యష్ రావణాసురుడిగా, కాజల్ అగర్వాల్ మండోదరిగా, రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణక పాత్రలో కనిపించబోతున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ భారీ మైథలాజికల్ డ్రామా మొదటి భాగాన్ని ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఇక రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.




# రూటు మార్చేసిన భన్సాలీ...

బాలీవుడ్ అగ్ర దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ అనగానే మనకు వెంటనే గుర్తొచ్చేది భారీ చారిత్రక నేపథ్యాలు, కళ్లు చెదిరే సెట్టింగులు, సాంప్రదాయ కట్టుబొట్టు. కానీ ఇప్పుడు ఆయన పూర్తిగా రూటు మార్చేశారు. తన మార్క్ పీరియాడికల్ డ్రామాలను పక్కనబెట్టి, ఏకంగా ఓ భారీ ఆధునిక ప్రపంచాన్ని సృష్టించే పనిలో పడ్డారు. అదే 'లవ్ & వార్'. ఈ సినిమాలో లేడీ సూపర్ స్టార్ అలియా భట్ లుక్ ఇప్పుడు నెట్టింట అగ్గి రాజేస్తోంది. ఈ అప్ కమింగ్ మూవీలో రణబీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ లాంటి క్రేజీ తారాగణం నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మేకర్స్ వదిలిన రణబీర్ కపూర్ ఫస్ట్ లుక్ కు ట్రెమండస్ రెస్పాన్స్ రాగా.. తాజాగా అలియా భట్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ఈ పోస్టర్ చూసిన ఫ్యాన్స్ ఒక్కసారిగా షాక్ అవుతున్నారు. మునుపెన్నడూ చూడని రేంజ్ లో అలియా ఇందులో తన గ్లామర్ తో విధ్వంసం సృష్టిస్తోంది.ఓ కుర్చీలో ఎంతో స్టైలిష్ గా, బాస్ లేడీలా కూర్చున్న అలియా.. స్లిట్ స్కర్ట్, తలపై ఓ స్పెషల్ హెడ్ పీస్ ధరించి ఇచ్చిన పోజు కుర్రకారుకు మతిపోగొడుతోంది. ఆమె లుక్, స్టైలింగ్, కళ్లల్లో కనిపిస్తున్న తీక్షణమైన హావభావాలు ఒక సరికొత్త 'మోడ్రన్-రెట్రో' ఫీల్ ను పంచుతున్నాయి. ఎప్పుడూ కాస్త క్యూట్ గా లేదా డీసెంట్ రోల్స్ లో మెప్పించే అలియా.. ఈ చిత్రంలో మాత్రం పూర్తిగా ఒక కొత్త అవతార్ లో విశ్వరూపం చూపించబోతోందని పోస్టర్ చూస్తేనే అర్థ-మవుతోంది. భన్సాలీ సినిమాల్లో హీరోయిన్ల ప్రజెంటేషన్ ఎంత అద్భుతంగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.. ఇప్పుడు ఈ ఆధునిక ప్రపంచంలో అలియాను ఆయన చూపించబోయే విధానం అందరినీ ఆశ్చర్యపరచడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ మూవీని 2027 జనవరి 21న హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ ఎత్తున విడుదల చేయనున్నారు.




# ఇదేం స్పీడు 'కాకా'..

ఈ చిత్రానికి సంబంధించిన డబ్బింగ్ పనులు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. ఈ విషయాన్ని చెబుతూ రిలీజ్ చేసిన వీడియో ప్రజెంట్ వైరల్ అవుతుండగా.. 'ఇదేం స్పీడు కాకా' అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు మెగా అభిమానులు.కాగా.. 'కాకా'లో మెగాస్టార్ చిరంజీవి కదిరి కాళీదాస్ పాత్రలో నటిస్తుండగా, అన్సూరా రాజన్, నివేతా పేతురాజ్, సునీల్, గెటప్ శ్రీను, కన్నడ నటి రచిత రామ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవిఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ ఈ సినిమాను నిర్మిస్తుండగా, ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. సినిమా షూటింగ్ అండ్ పోస్ట్-ప్రొడక్షన్ పనులను ఏకకాలంలో జరుపుతూ చిత్ర యూనిట్ ఫుల్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. బాక్సాఫీస్ వద్ద ఒక సరికొత్త రికార్డును సృష్టించే లక్ష్యంతో 'ది బ్లడీ బెంచ్‌మార్క్' అనే క్యాప్షన్‌తో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

# మమితా బైజు కోరిక తీరేదెన్నడు?

తమిళంలో నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్', మలయాళంలో చేసిన 'బెత్లహాం కుటుంబ యూనిట్' సూపర్ హిట్ అయినా, తెలుగు దర్శక నిర్మాతల దృష్టి ఈ అమ్మడిపై పడడం లేదు. మమిత స్టార్స్ పక్కన సెట్ అవుతుందా అన్న డౌట్‌తో ఉన్నారు తెలుగు దర్శకులు. ఏజ్ గ్యాప్ లవ్ స్టోరీ రాసుకుంటే ముందు ఆప్షన్ ఈ అమ్మడే. ఎందుకంటే, ఆల్రెడీ నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'బెత్లహాం కుటుంబ యూనిట్' ఇలాంటి కథలతో రూపొందినవే. 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో సూర్య, మమిత మధ్య 20 ఏళ్ల గ్యాప్ ఉంది. బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న 'బెత్లహాం కుటుంబ యూనిట్' కూడా ఏజ్ గ్యాప్ లవ్ స్టోరీనే, హీరో హీరోయిన్ల క్యారెక్టర్స్ మధ్య 12 ఏళ్ళ గ్యాప్ ఉంటుంది. మమితా బైజు తమిళ, మలయాళ సినిమాలు తెలుగులో హిట్ అయినా, ఇక్కడ మాత్రం ఆఫర్స్ రావడం లేదు. మలయాళంలో ఛాన్స్ వచ్చినా, అక్కడ రెమ్యునరేషన్ కోటి లోపే ఉంటుంది. తెలుగులో ఆఫర్ రావాలి గానీ, రెండు కోట్లకు పైగా డిమాండ్ చేయాలన్న ప్లాన్‌లో ఉన్నా.. ఆ ఛాన్సే రావడం లేదు అమ్మడికి.



# మొదలుపెట్టారు



కోలీవుడ్ లో సంచలన విజయం సాధించిన స్పోర్ట్స్ డ్రామా 'లబ్బర్ పందు'. థియేట్రికల్ గా సూపర్ హిట్ అయిన ఈ చిత్రంతో ఆడియెన్ తో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు . ధనుష్ కోసం ఒక పక్కా మాస్ అండ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. 'సార్' సినిమాతో ధనుష్‌కు తెలుగులో మంచి విజయాన్ని అందించిన సితార ఎంటెర్టైనమెంట్స్ ఈసారి ధనుష్‌తో పాన్-ఇండియా హిట్ ఇచ్చేందు భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తోంది. ధనుష్ మార్క్ పవర్ ఫుల్ పర్ఫార్మెన్స్, తమిళరసన్ పచ్చముత్తు మార్క్ టేకింగ్, సితార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్ తో రాబోతున్న ఈ సినిమాలో ధనుష్ సరసన కథానాయికగా ప్రీతి ముకుందన్ నటిస్తుండగా, ఇతర ప్రధాన పాత్రల్లో వైవిధ్యమైన నటుడు ఎస్.జె. సూర్య మరియు హాస్య నటుడు వడివేలు కనిపించనున్నారు. అలాగే ఉరియాడి సినిమాతో హీరోగా దర్శకుడిగా పేరుతెచ్చుకున్న విజయ్ కుమార్ విలన్ గా నటించబోతున్నాడు. కోలీవుడ్ మ్యూజిక్ సంచలనం యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు.

# దృష్టి పెట్టకపోతే కష్టమే..

కన్నడ చిత్రం 'ముగిల్‌పేట'తో సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది హీరోయిన్ కాయదు లోహార్. మొదటి చిత్రంతోనే నటన పరంగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ అమ్మడు.. తెలుగులోకి 'అల్లూరి' చిత్రంతో అడుగు పెట్టింది. ఆ తర్వాత లోహార్‌కు తెలుగులో అవకాశాలు వస్తున్నప్పటికీ విజయాలు మాత్రం వరించడం లేదు. ఇటీవల వచ్చిన 'ఫంకీ' చిత్రం కూడా బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలయింది. దీంతో నాని 'ది ప్యారడైజ్'పైనే అమ్మడు ఆశలు పెట్టుకున్నది. ఇక భారీ అంచనాలు మధ్య ఈ చిత్రం మిక్సిడ్ టాక్ తెచ్చుకుంటున్నప్పటికీ కలెక్షన్లు మాత్రం భారీగానే రాబడుతోంది. కానీ ఈ చిత్రంలో ఆమెకు అవకాశం దక్కినా ప్రయోజనం లేకపోయినట్లు టాక్. ఇందులో తండ్రి అప్పులు తీర్చేందుకు బి-గ్రేడ్ చిత్రాల్లో నటించే విచిత్రమైన పాత్రలో ఆమె కనిపించడం ప్రేక్షకులకు తీవ్ర అసహనాన్ని కలిగించింది. ఇలాంటి అభ్యంతరకర పాత్రను ఎంచుకోవడం ఆమె కెరీర్‌కు ఏమాత్రం మేలు చేయకపోగా, నెగెటివిటీని మూటగట్టుకుంది. దీంతో ఇప్పటికైనా కథల ఎంపికపై ఆమె దృష్టి పెట్టకపోతే కష్టమేనని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.




# వెనక్కి తగ్గేదేలే..

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ క్రమంలోనే "రణబాలి" సినిమా విడుదల వాయిదా పడుతుందనే రూమర్స్‌కు చెక్ పెడుతూ తాజాగా మేకర్స్ విడుదల తేదీతో సరికొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. తన మాతృభూమిని, తన ప్రజల్ని కాపాడేందుకు ప్రతిజ్ఞ చేసి వీరతిలకం పెట్టుకున్న యోధుడు రణబాలిగా విజయ్ దేవరకొండ మెస్మరైజింగ్ లుక్‌తో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా.. రీసెంట్‌గా ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన 'ఏందయ్య సామీ..' ఫుల్ లిరికల్ సాంగ్‌కు నెట్టింట హ్యూజ్ రెస్పాన్స్‌తో దూసుకుపోతున్నది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్‌లో ఆసక్తి కలిగిస్తోంది.



Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**